


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 02.08.2025 | సంపుటి : 2 | సంచిక :180 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Saturday | 02.08.2025 | volume : 2 | Issue : 180 | Pages : 8 | Cost : 2/- |

# ఉపరాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల

- 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ
- నామినేషన్ల దాఖలుకు ఆగస్టు 21 చివరి తేదీ
- సెప్టెంబర్ 9న ఎన్నిక.. అదేరోజు ఫలితం ప్రకటన



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 1 :**
జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీగా ఉన్న ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికల సంఘం కసరత్తు మొదలు పెట్టింది. ఈ క్రమంలో నూతన ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం శుక్రవారం షెడ్యూల్ విడుదలైంది. సెప్టెంబర్ 9న ఆ ఎన్నిక జరగనుందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఈ ప్రక్రియ అనివార్యమైంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ధన్‌ఖడ్ తన పదవిని వీడారు. ఈ నేపథ్యంలో ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. దీనిపై ఆగస్టు 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయనుంది. నామినేషన్ల దాఖలుకు చివరితేదీ ఆగస్టు 21గా ప్రకటించింది. పోలింగ్ తేదీ నాడే అంటే సెప్టెంబర్ 9నే ఫలితాలు వెల్లడి కానున్నాయి.

మిగతా 06 లో



## అనిల్ అంబానీపై లుకౌట్ నోటీసులు

- 17 వేల కోట్ల మేర రుణ మోసాలు
- ఆగస్టు 17న విచారణకు హాజరుకావాలని ఈడీ సమన్లు

04



## యాదాద్రి థర్మల్ కేంద్రం జాతికి అంకితం

- మొదటి యూనిట్ గ్రిడ్‌కు అనుసంధానం
- 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్ ప్రారంభం

04

నల్గొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రంలోని 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్ అందుబాటులోకి వచ్చింది. దీనిని జాతికి అంకితం చేశారు. మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ శుక్రవారం నాడిక్కడ జరిగినకార్యక్రమంలో జాతికి అంకితం చేశారు. కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. అంతకుముందు యాదాద్రి థర్మల్ విద్యుత్కేం ద్రంలో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు మంత్రులు శంకుస్థాపన చేశారు.



## సీఎం రేవంత్‌రెడ్డికి కాళేశ్వరం నివేదిక

### అందచేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్ 1 :**
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కాళేశ్వరం కమిషన్ నివేదికను రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ న్యాయ విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. సంబంధిత నివేదికను గురువారం నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు ఆయన అందజేశారు. శుక్రవారం ఆ నివేదిక సీఎంకు చేరింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు భేటీ అయ్యారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై వీరంతా చర్చించారు. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో అన్ని రకాల వైఫల్యాలు జరిగాయని, దీనికి కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పలువురు కారణమని నివేదికలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ స్పష్టం చేసినట్లు తెలిసింది. వ్యవస్థలు కాకుండా వ్యక్తుల ఇష్టాల ప్రకారం పనులు జరిగాయని, ఉన్నత స్థాయిలో వచ్చిన ఒత్తిడులకు లొంగి నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకొన్నారని, ఆర్థిక అవకతవకలు జరిగా యని.. ఇలా పలు అంశాలను కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ పేర్కొన్నట్లు సమాచారం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి డీపీఆర్ తయారీ మొదలుకొని మేడిగడ్డ బ్యారేజీ కుంగడం.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో సీపేజీల వరకు ఎప్పుడు ఏం జరిగింది.. రికార్డుల ఆధారంగా ఎక్కడ ఎవరు బాధ్యులన్నది వివరంగా నివేదికలో తెలియజేసినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.




## బీహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితా

- వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన ఈసీ
- సబంధిత అధికారుల వద్ద అభ్యంతరాల పరిశీలన

06



## నేను ఏ తప్పు చేయలేదు

- పోలీసుల విచారణలో నమ్రత
- సృష్టి కేసులో డాక్టర్ నమ్రత కస్టడీ విచారణ

03

# గొర్రెల స్కామ్ ₹1000 కోట్లపైనే!

200కి పైగా బెట్టింగ్ యాప్స్ ఖాతాలతో లావాదేవీలు

7 జిల్లాల్లో కాగ్ నివేదికలో పేర్కొన్న నష్టం కేవలం రూ.254 కోట్లు

మొత్తం 33 జిల్లాల లెక్కలు తీస్తే రూ.వెయ్యి కోట్లు దాటే అవకాశం

మాజీ మంత్రి తలసాని ఓఎస్డీ కల్యాణ్ కుమార్‌దే క్రియాశీలపాత్ర



**హైదరాబాద్, ఆగస్ట్ 1 :**
గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో చేపట్టిన గొర్రెల పంపిణీ పథకంలో.. రూ.వెయ్యి కోట్ల కుంభకోణం జరిగినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గుర్తించింది. కేవలం 7 జిల్లాల్లో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) అధ్యయనం చేస్తేనే రూ.253.93 కోట్ల మేర నిధులు దుర్వినియోగం అయినట్లు లెక్కతేలిందని.. మొత్తం 33 జిల్లాల లెక్కలు తీస్తే ప్రభుత్వానికి కలిగిన నష్టం రూ.వెయ్యి కోట్ల దాకా ఉంటుందని ఈడీ వెల్లడించింది. గొల్ల, కురుమ లబ్ధిదారులకు వెళ్లాల్సిన ప్రభుత్వ నిధులు, ప్రైవేటు వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు బదిలీ అయినట్లు ఈడీ విచారణలో తేలింది.

04



06

## ఆర్ఎస్ఎస్ చీఫ్‌ను అరెస్టు చేయాలని అప్పట్లో ఆదేశాలు వచ్చాయి

మాజీ ఏటీఎస్ అధికారి మహబూబ్ ముజావ్ ప్రకటన



## అసెంబ్లీలో రమ్మీ ఆడిన మంత్రికి క్రీడల శాఖ

మహారాష్ట్ర ప్రభుత్వం షాకింగ్ నిర్ణయం

06

# సాగునీటి జలాలపై అవగాహన తెచ్చుకోండి

### బనకచర్లపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎలా?

- ఇదేమి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాదని గుర్తుంచుకోండి
- నదీజలాల కేటాయింపులు తెలిసి మాట్లాడాలి
- కాళేశ్వరాన్ని అడ్డుకోవడానికి చంద్రబాబు లేఖలు రాశారు
- లోకేశ్ వ్యాఖ్యలపై మండిపడ్డ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



**హైదరాబాద్, ఆగస్ట్ 1 :**
సాగునీటి జలాలపై నారా లోకేశ్‌కు అవగాహన లోపం ఉందని, ఆయన యంగ్‌స్టర్ అయినా భవిష్యత్తును చెడగొట్టుకుంటున్నారని, అవగాహన లేకుండా మాట్లాడి ప్రజల ముందు అభాసుపాలుకావద్దని బీఆర్ఎస్ నేత, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. "ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాదు... ఇష్టం వచ్చినట్లు మాట్లాడేలా పరిస్థితి లేదు," అంటూ హరీష్ రావు వార్నింగ్ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఇలా అన్నారు. అధికారం ఉందని, మద్దతు ఉందని ఏది మాట్లాడినా చెల్లుతుంది అనుకుంటే పొరపాటు అని అన్నారు.

03



03

## పెళ్లికాని డబ్బున్న వ్యక్తులే ఆమె లక్ష్యం

తొమ్మిదో పెళ్లి కోసం ప్రయత్నించి పోలీసుల చేతికి..

పెళ్లికాని డబ్బున్న వ్యక్తులే ఆమె లక్ష్యం. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో వారి వివరాలు సేకరిస్తుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్ పెడుతుంది. ఆ తర్వాత తనకు విడాకులయ్యాయని, ఓ బిడ్డ కూడా ఉన్నట్లు అవతలి వాళ్లకు ఎమోషనల్‌గా దగ్గరవుతుంది. చివరికి వివాహం చేసుకుంటుంది. ఇలా ఒకటి, రెండు కాదు.. ఏకంగా 8 పెళ్లిళ్లు చేసుకుంది. తొమ్మిదో పెళ్లి కోసం పావులు కదుపుతూ పోలీసులకు చిక్కింది.



## కేసీఆర్, హరీష్‌రావు తాకట్టు రాజకీయాలు

- ఆంధ్రాకు మేలు చేసేలా గతంలో నిర్ణయాలు
- తప్పిదాలు సరిదిద్దేలా కాంగ్రెస్ అడుగులు
- పాదయాత్రలో బీఆర్ఎస్‌పై ఘాటు విమర్శలు

02

బీఆర్ఎస్ అధినాయకత్వంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. బనకచర్ల విషయంలో గత పాలకులదే ముమ్మాటికీ తప్పని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీష్‌రావు తాకట్టు- రాజకీయాలు చేసి ఆంధ్రా పాలకులకు మేలు చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతల తప్పిదాలను సరిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ దిశగా అడుగులు వేస్తోందని ఉద్ఘాటించారు. తాకట్టు- పెట్టిన వాటాను వెనక్కు తేవడానికి ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు మహేష్ కుమార్ గౌడ్.

# సమస్యలపై పోరాటంలో కమ్యూనిస్టులది అగ్రభాగం

- అధికారంలో ఉన్నవారిని దించడంలో కమ్యూనిస్టులే ముందుంటారు
- వంటకంలో ఉప్పులాంటి వారు.. వారు లేకుంటే రాజకీయాలు లేవు
- దిగజారుతున్న జర్నలిజం విలువలు.. సోషల్ మీడియాలో అరాచకాలు
- సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్ట్ 1 :** ప్రజా సమస్యలపై పోరాటంలో కమ్యూనిస్టులు ఎప్పుడూ ముందుండే వారని, వారి పోరాటం రాజీలేనిదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కమ్యూనిస్టుల విశిష్టతను పేర్కొన్నారు. "కమ్యూనిస్టులు తప్పు చేసిన వారిని గద్దె దించడంలో వారు ఎప్పుడూ ముందుంటారు" అని ఆయన వ్యాఖ్యానించారు. వంటకంలో ఉప్పు లాంటి వారు అని ఎన్ని మసాలాలు ఉన్నా, ఉప్పు లేకపోతే వంటకు రుచి రాదు. రాజకీయాల్లో కూడా వారు అంతే ముఖ్యమైన పాత్ర వహిస్తున్నారు అని అన్నారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కమ్యూనిస్టులు చేపట్టిన విద్యుత్ ఉద్యమాలే కారణమని గుర్తు చేస్తూ, 2023లో కూడా పరోక్షంగా తమ విజయానికి తమ్మినేని వీరభద్రం వంటి నేతల పాదయాత్రలు, పోరాటాలు సహకరించాయని తెలిపారు.

### జర్నలిజం విలువలు దిగజారుతున్నాయి

"నేటి జర్నలిజం విలువలు దిగజారుతున్నాయి. ప్రతి ఒక్కరూ జర్నలిస్టులని ప్రకటించుకుంటున్నారు. జర్నలిజం వృత్తిలో ఉన్నవారు తమ బాధ్యతను మరవకూడదు. సోషల్ మీడియా పేరుతో ఎవరి మీదనైనా అసభ్యంగా మాట్లాడే ధోరణి పెరుగుతోంది." "సోషల్ మీడియా జర్నలిస్టులు ప్రత్యేకంగా గుర్తింపు పొందాలి. వాళ్లు మరియు పరంపరాగత జర్నలిస్టులు ఒకటే కాదన్న విషయాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉంది" అని సీఎం అన్నారు. పెన్నులు పట్టుకోగలిగే అర్హత లేకపోయినా, నేను జర్నలిస్టను అంటూ పేరు పక్కనే 'జర్నలిస్ట్' అని పెట్టుకుంటున్నారు. అది ఇంటి పేరు కాదు. జర్నలిజం చదవని వారు, అక్షరాలైనా రాయలేని వారు ఇలా తమను జర్నలిస్టులుగా ప్రకటించుకుంటున్న పరిస్థితి ఆవేదన కలిగిస్తుంది. ఈ రోజు ఎవరు ఎక్కువ తిట్లేస్తే వాళ్లే ఫేమస్ అవుతారని భావిస్తున్నారు. జర్నలిజం ముసుగులో కొందరు అసభ్యంగా ప్రవర్తిస్తున్న వారు ముందువరుసలో కూర్చుంటారు. వాళ్లు ఏదైనా పెత్తనం చూపాలని చూస్తారు. అప్పుడు నాకు క్షణంలో కోపం వచ్చేస్తుంది. కానీ, పదవి, బాధ్యతలు అదుపుగా నిలుస్తాయి" అని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నరేందర్ రెడ్డి, సీపీఎం నేతలు రాఘవులు, తమ్మినేని వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ సందర్శకులకు ఈ-పాస్

**హైదరాబాద్, ఆగస్ట్ 1 :** రాష్ట్ర సచివాలయంలోకి సందర్శకుల ఎంట్రికి ఈ -పాస్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ విధానం విజిటర్ ఈ పాస్ మేనేజ్ మెంట్ సిస్టమ్ నుంచి అమలులోకి వచ్చింది. ఇకపై సచివాలయంలోకి నిత్యం ఎంతమంది సందర్శకులు ప్రవేశిస్తున్నారు, ఏయే ప్రభుత్వ శాఖల వద్దకు ఎంత మంది సందర్శకులు వెళ్తున్నారనే వివరాలు స్పష్టం అయ్యే అవకాశం ఉంది. కొత్త సచివాలయం నిర్మాణం పూర్తి అయ్యాక గత ప్రభుత్వం సచివాలయంలోకి సందర్శకులను, మీడియా ప్రతినిధులను అనుమతించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం రోజు నుంచి సచివాలయంలో మీడియాను, సందర్శకులను అనుమతిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో సచివాలయంలోకి సందర్శకుల తాకిడితో పాటు– వాహనాల రాకపోకల సంఖ్య గణనీయంగా పెరిగి పోయింది. వాహనాలను భద్రతా తనిఖీలు నిర్వహించడం కూడా గగనంగా మారింది. అందరూ విఐపిలకు సంబంధించిన వారు కావడం వల్ల వారి వాహనాలను నిలిపితేనే కసురుకునే పరిస్థితులను భద్రతాసిబ్బంది ఎదుర్కొంటు–న్నారు. సచివాలయంలో మంత్రులఅ వద్దకు వచ్చే పెద్దలు కొందరు వాహన భద్రత ప్రమాణాలు పాటించకపోవడం గమనార్హం. ఎవ్వరిని నొప్పించకుండా భద్రతా సిబ్బంది తమ విధులను నిర్వహిస్తున్నప్పటికీ అప్పుడప్పుడు మంత్రుల పేషీల నుంచి వారికి మందలింపులు ఎదుర్కొనక తప్పడంలేదు. సచివాలయంలో పార్కింగ్ స్థలానికి మించి వాహనాల సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల సచివాలయం భద్రతాసిబ్బందికి కూడా ఇబ్బందికరంగా మారింది.

## రష్యాతో చమురు బేరం కొనసాగుతుంది

- భారత్ తన వాణిజ్య అవసరాల మేరకు నడుచుకుంటుంది
- ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో విదేశాంగ ప్రతినిధి స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 1 :** భారత్‌పై 25 శాతం దిగుమతి సుంకాలు విధించడంతో పాటు– రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై భారత్ ఆచితూచి స్పందించింది. ఆ రెండు దేశాలు పతనమైన ఆర్థిక వ్యవస్థలంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై చెప్పడానికి ఏమీ లేదని భారత్ పేర్కొంది. ముఖ్యమైన ఎజెండాపైనే తమ రెండు దేశాలు దృష్టి సారించాయని, అదే విధంగా రష్యా నుంచి చమురు కొనుగోలుకు భారత్ కట్టుబడి ఉందని స్పష్టం చేసింది. భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ శుక్రవారం నాడిక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. భారత్–అమెరికా దేశాల భాగస్వామ్యం అనేక మార్పులు, సవాళ్లను ఎదుర్కొందని తెలిపారు. ఇందుకు అనుగుణంగానే ముఖ్యమైన ఎజెండాపైనే తాము దృష్టి సారించామని చెప్పారు. ఈ భాగస్వామ్యం కొనసాగుతుందని విశ్వసిస్తున్నట్టు ఆశాభావం వ్యక్తం చేశారు. రక్షణ సంబంధాల్లో అమెరికాతో భారత్ బలమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉందన్నారు. గత కొన్నేళ్లుగా ఇవి మరింత బలపడ్డాయని చెప్పారు. ఏ రెండు దేశాల మధ్య సంబంధాలు మూడో దేశం కోణంలో చూడకూడదని, వివిధ దేశాలతో మన సంబంధాలు వేటికవే సొంత అర్హతలు కలిగి ఉన్నాయని జైశ్వాల్ అన్నారు. భారత్–రష్యా సంబంధాలపై మాట్లాడుతూ.. రెండు దేశాల మధ్య నిలకడైన సంబంధాలు ఉన్నాయని, కాలపరీక్షకు నిలిచిన భాగస్వామ్యం తమదని చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగానే తమ నిర్ణయాలు ఉంటాయని, దేశ ఇంధన ప్రయోజనాలను కాపాడుకోవడంతో భాగంగా అంతర్జాతీయ మార్కెట్లో అత్యుత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేసుకుని భారత్ ముందుకు సాగుతుందని అన్నారు. దేశ ఇంధన ప్రయోజనాలను కాపాడుకోవడంలో భాగంగా అంతర్జాతీయ మార్కెట్లో అత్యుత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేసుకుంటూ ముందుకు వెళ్తామన్నారు.

## నిరాహార దీక్షకు అనుమతివ్వని పోలీసులు

### హైకోర్టుకు ఎమ్మెల్సీ కవిత?



**హైదరాబాద్, ఆగస్ట్ 1 :** బీసీలకు 42 శాతం రిజర్వే షన్ల సాధనలో భాగంగా 72 గంటల నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించిన విషయం తెలిసి ందే. ఆమె దీక్షకు పోలీసులు అనుమతి నిరాకరిం చారు. దీంతో కవిత హైకోర్టును ఆశ్రయించను న్నట్లు సమాచారం. ప్రభుత్వం అడ్డుకున్నా.. ఎన్ని ఆటంకాలు సృష్టించినా 72 గంటల నిరాహార దీక్ష చేస్తానని కవిత స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది లేదన్నారు.

## ఉపఎన్నికలు నిర్ణయించేది కేటీఆర్ కాదు ఎలక్షన్ కమిషన్


### ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**హనుమకొండ, ఆగస్ట్ 1 :** పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే అర్హత కేసీఆర్, కేటీఆర్‌కు లేదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హనుమకొండలో ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని కాలరాసిందే భారత రాష్ట్ర సమితి అని విమర్శించారు. వారి పదేళ్ల పాలనలో పార్టీలు, ఎమ్మెల్యేలను విలీనం చేసుకున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేల అనర్హత అంశంలో స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. ఉపఎన్నికలు నిర్ణయించేది కేటీఆర్ కాదని.. ఎలక్షన్ కమిషన్ అని చురకలు అంటించారు.

## 'ఫాల్కన్' మోసం..

### రూ.18 కోట్ల విలువైన ఆస్తులు జప్తు




**హైదరాబాద్:** ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ స్కీమ్ కేసుల్లో సంస్థకు చెందిన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) జప్తు చేసింది. రూ.18.14 కోట్లు విలువైన 12 స్థిరాస్తులను అధికారులు జప్తు చేశారు. మెస్సర్ క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు అమర్‌దీప్ కుమార్‌పై ఈడీ అధికారుల దర్యాప్తు కొనసాగుతున్న విషయం తెలిసిందే. బాధితుల నుంచి పెట్టుబడుల పేరుతో దాదాపు రూ.792 కోట్లు ఈ సంస్థ వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో మోసం చేసి సంపాదించిన అక్రమ ఆస్తులను గుర్తించి వాటిని జప్తు చేస్తున్నారు. ఫాల్కన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అమర్‌దీప్ కుమార్‌కు చెందిన హాకర్ విమానాన్ని ఇప్పటికే ఈడీ జప్తు చేసింది.

## తెలంగాణలో రేషన్ కార్డుల పండుగ

- ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మల ఇళ్లు
- వీటిపై బిఆర్ఎస్ నేతలో చర్చకు సిద్ధం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**హైదరాబాద్, ఆగస్ట్ 1 :** తెలంగాణలో ఇప్పుడు రేషన్ కార్డుల పండుగ జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కొక్క నియోజకవర్గానికి 3,500 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఉచిత బస్సులు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత కరెంట్, 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని సంతోషం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనూ 3,500 ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే కొత్తగా 5500 రేషన్ కార్డులు ఇస్తున్నామని నొక్కిచెప్పారు. ఈ విషయంపై బీఆర్ఎస్ నేతలు చర్చకు సిద్ధమా అని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. రేషన్ కార్డుల్లో అర్హులు ఉంటే లబ్ధిదారులందరికీ అందజేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. రేషన్ కార్డుల్లో 2,30,000 మంది నూతన పేర్లు చేర్చామని చెప్పుకొచ్చారు. రేషన్ కార్డులు రాని పేదలు దరఖాస్తు చేసుకుంటే పార్టీలకు అతీతంగా అందజేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో రోడ్లు, విద్యుత్, ఇతర సమస్యలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. 56941 రేషన్ కార్డులు ఉంటే 2లక్షల మందికి సన్నబియ్యం అందజేస్తున్నామని ప్రకటించారు. అభివృద్ధి పనుల్లో తమ ప్రభుత్వం రాజకీయం చేయదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం రేషన్ కార్డుల పంపిణీని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. స్థానిక ఫంక్షన్ హాల్లో ఏర్పాటు– చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిచందన, కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, దేదీప్య, రాజ్‌కుమార్ పటేల్ తదితరులతో కలిసి లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 11 ఏళ్ల తర్వాత తొలిసారిగా ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులను అందజేసిందని ప్రకటించారు గత కేసీఆర్ ప్రభుత్వం పేదలకు ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించలేదని.. తమ ప్రభుత్వంలో రేషన్ కార్డుల కోసం ప్రజల ఎదురుచూపులకు తెరపడిందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## కేసీఆర్, హరీష్‌రావు తాకట్టు రాజకీయాలు

- ఆంధ్రాకు మేలు చేసేలా గతంలో నిర్ణయాలు
- తప్పిదాలు సరిదిద్దేలా కాంగ్రెస్ అడుగులు
- పాదయాత్రలో బీఆర్ఎస్‌పై ఘాటు విమర్శలు



**వికారాబాద్, ఆగస్ట్ 1 :** బీఆర్ఎస్ అధినాయకత్వంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. బనకచర్ల విషయంలో గత పాలకులదే ముమ్మాటికీ తప్పని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీష్‌రావు తాకట్టు– రాజకీయాలు చేసి ఆంధ్రా పాలకులకు మేలు చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతల తప్పిదాలను సరిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ దిశగా అడుగులు వేస్తోందని ఉద్ఘాటించారు. తాకట్టు– పెట్టిన వాటాను వెనక్కు తేవడానికి ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు మహేష్ కుమార్ గౌడ్. శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిగిలో మహేష్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా పరిగిలో జనహిత పాదయాత్ర ముగింపు అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో 2014 నుంచి మొన్నటి వరకు గత బీఆర్ఎస్ పాలకులు చేసిన తప్పిదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. అప్పటి ఆంధ్రా పాలకులకు కేసీఆర్, హరీష్‌రావు తలొగ్గి కాంప్రమైజ్ అయ్యారని ఫైర్ అయ్యారు మహేష్ కుమార్ గౌడ్. బనకచర్ల ప్రాజెక్టు సంపూర్ణంగా పూర్తయితే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మహేష్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డుకట్ట వేశామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ నాయకుల తప్పిదాలు బయటకు వస్తాయని పసిగట్టి తమ ప్రభుత్వంపై ముందే ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. బనకచర్ల విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం తప్పు చేసింది... దాన్ని సరిదిద్దే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. మహేష్ కుమార్ గౌడ్ పరిగి నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ముఖ్య ఉద్దేశం ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడం, వారి సమస్యలు తెలుసుకోవడం అని ఆయన స్పష్టంగా తెలిపారు. మేము అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యలో ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ పాదయాత్రను ప్రారంభించాం. ఇది కేవలం ఒక రాజకీయ కార్యక్రమం కాదు. ప్రజల జీవితాల్లో ఎదుర వుతున్న వాస్తవాలను నేరుగా తెలుసుకోవడానికి, వారి సలహాలు, సూచనలు స్వీకరించడానికి ఇదొక సాధనంలా వుంది,' అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ యాత్రల నుండి రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర వరకు పాదయాత్రలు దేశ ప్రజలను చైతన్యపరిచిన ఉదాహరణలుగా నిలిచాయని గౌడ్ గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన పాదయాత్రలు కూడా ప్రజల్లో కొత్త ఆశలు నింపాయన్నారు. అదే దారిలో టీ–పీసీసీ ఈ పాదయాత్రకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఈ యాత్రలో ఏఐసీసీ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌తో పాటు– రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. తదుపరి పాదయాత్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొననున్నట్లు మహేష్ గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏడున్నర లక్షల కోట్ల అప్పులతో తాము అధికారం చేపట్టామని, అయినప్పటికీ ప్రతి నెలా 6 వేల కోట్ల అప్పు చెల్లిస్తూ, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గౌడ్ వివరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల నిబంధనపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టు–బడి ఉందని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకే స్పందనగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. వారికి న్యాయం చేయడమే మా లక్ష్యం, అంటూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

## అనిల్ అంబానీపై లుకౌట్ నోటీసులు

- 17 వేల కోట్ల మేర రుణ మోసాలు
- ఆగస్టు 17న విచారణకు హాజరుకావాలని ఈడీ సమన్లు



**ముంబాయి :** అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. రూ.17 వేల కోట్ల మేర రుణ మోసాలకు సంబంధించిన కేసులో ఆయనపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. విచారణ సమయంలో దేశం విడిచిపోకుండా ఉండేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విజ్ఞప్తి మేరకు ఈ లుకౌట్ సర్క్యులర్ జారీ అయ్యింది. ఈ కేసులో ఆగస్టు 17న విచారణకు హాజరుకావాలని ఈడీ ఇప్పటికే అనిల్ అంబానీకి సమన్లు జారీ చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఆయన స్టేట్‌మెంట్ రికార్డ్ చేయనున్నట్లు అధికారిక వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. రుణ మోసానికి సంబంధించిన కేసులో గతవారం అనిల్ అంబానీకి చెందిన పలు కార్యాలయాల్లో మూడు రోజుల పాటు ఈడీ సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. 50 కంపెనీలు, 25 మంది వ్యక్తులకు చెందిన ముంబయిలోని 35 ప్రాంగణాల్లో తనిఖీలు జరిగాయి. ఈ సోదాల్లో పలు కీలక దస్త్రాలను దర్యాప్తు అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆయనకు ఈడీ సమన్లు, లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. 2017–19 మధ్య అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలకు యెస్ బ్యాంక్ ఇచ్చిన రూ.3,000 కోట్ల రుణాలు చట్టవ్యతిరేక పద్ధతుల్లో దారిమళ్లాయన్న ఆరోపణలు వచ్చాయి. ఆ బ్యాంక్ మాజీ ప్రమోటర్లకు లంచం ఇచ్చారన్న అభియోగాలు ఉన్నాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తీసుకున్న రూ.10వేల కోట్ల రుణాలను కూడా దారి మళ్లించారనే ఆరోపణలూ ఉన్నాయి. ఇవి కాకుండా ఆర్‌కామ్–కెనరా బ్యాంకుల మధ్య రూ.1,050 కోట్ల రుణం విషయంలోనూ మోసాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో పాటు ఏటీ–1 బాండ్లలో (బ్యాంకులు జారీ చేసే అడిషినల్ టైర్–1 బాండ్లు) రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ రూ.2,850 కోట్ల మేర పెట్టుబడులు పెట్టిందని, ఇందులో క్విడ్ ప్రోకోకు పాల్పడిందనే ఆరోపణలు వినిపించాయి. ఇలా అనిల్ అంబానీకి చెందిన కంపెనీలు దాదాపు రూ.17 వేల కోట్ల మేర బ్యాంకు రుణాల మోసాలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది.



## ఐర్లాండ్‌లో భారతీయులపై దాడులు

### ఎంబసీ కీలక అడ్వైజరీ

**ఐర్లాండ్ :** ఐర్లాండ్‌లో భారత పౌరులపై ఇటీవల భౌతిక దాడులు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో పౌరుల భద్రతకు సంబంధించి అక్కడి భారత రాయబార కార్యాలయం కీలక అడ్వైజరీ జారీ చేసింది. ప్రతికూల సమయాల్లో నిర్జన ప్రదేశాలకు వెళ్లొద్దని, భద్రతాపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. "ఐర్లాండ్‌లోని భారతీయులపై ఇటీవల భౌతిక దాడుల కేసులు పెరుగుతున్నాయి. ఈ విషయంలో ఐర్లాండ్ అధికారులతో భారత రాయబార కార్యాలయం సంప్రదింపులు జరుపుతోంది. ఇదే సమయంలో పౌరులు కూడా వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా నిర్జన ప్రదేశాలకు వెళ్లొద్దు" అని అడ్వైజరీలో పేర్కొంది. అత్యవసర పరిస్థితుల్లో ఎంబసీని సంప్రదించాలని సూచిస్తూ (0899423734, cons.dublin@mea.gov.in) ఫోన్, మెయిల్ ఐడీ వివరాలను అందించింది. రాజధాని డబ్లిన్ శివారులోని తల్లాగ్ట్‌లో జులై 19న డాక్టర్ సంతోష్ యాదవ్ అనే భారత పౌరుడిపై కొందరు స్థానిక యువకులు జాత్యాహంకార దూషణలు చేస్తూ దాడికి పాల్పడ్డారు. ముఖం, ఛాతీ, కాళ్లు, చేతులపై పిడిగుద్దులతో రక్తస్రావం అయ్యేలా చితకబాదారు. చివరకు బాధితుడు మేల్కొని పోలీసులకు సమాచారం అందించడంతో అంబులెన్స్‌లో అతడిని ఆసుపత్రికి తరలించారు. తనకు ఎదురైన అనుభవాన్ని వివరిస్తూ సోషల్ మీడియా వేదికగా సంతోష్ యాదవ్ ఇటీవల పోస్టు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. స్థానికంగా బస్సులు, నివాస ప్రాంతాలు, వీధుల్లో ఇటువంటి జాత్యాహంకార దాడులు సాధారణంగా మారిపోయాయని వాపోయాడు. ఈ దాడి ఘటనపై కేసు నమోదు చేసిన ఐర్లాండ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే, ఈ ఘటన షాక్‌కు గురిచేసిందని ఐర్లాండ్‌లోని భారత రాయబారి అఖిలేశ్ మిశ్రా అప్పట్లో స్పందించారు. బాధిత కుటుంబ సభ్యులతో టచ్‌లో ఉన్నామని, అవసరమైన సాయాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఈ దాడిని ఖండిస్తూ స్థానికంగానూ నిరసనలు వెల్లువెత్తాయి. విదేశీ పౌరులపై దాడులు చేస్తున్న వారిపై స్థానిక ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు చేశారు.

# సాగునీటి జలాలపై అవగాహన తెచ్చుకోండి

- బనకచర్లపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎలా?
- ఇదేమి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాదని గుర్తుంచుకోండి
- నదీజలాల కేటాయింపులు తెలిసి మాట్లాడాలి
- కాళేశ్వరాన్ని అడ్డుకోవడానికి చంద్రబాబు లేఖలు రాశారు
- లోకేశ్ వ్యాఖ్యలపై మండిపడ్డ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



**హైదరాబాద్, ఆగస్ట్ 1 :** సాగునీటి జలాలపై నారా లోకేశ్‌కు అవగాహన లోపం ఉందని, ఆయన యంగ్‌స్టర్ అయినా భవిష్యత్తును చెడగొట్టుకుంటున్నారని, అవగాహన లేకుండా మాట్లాడి ప్రజల ముందు అభాసుపాలుకావద్దని బీఆర్ఎస్ నేత, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. "ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాదు... ఇష్టం వచ్చినట్లు మాట్లాడేలా పరిస్థితి లేదు," అంటూ హరీష్ రావు వార్నింగ్ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఇలా అన్నారు. గురువారం నారా లోకేశ్ మాట్లాడుతూ, "మిగులు జలాలు సముద్రంలో కలుస్తున్నాయి. కనబడటం లేదా?" అని వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన హరీష్ రావు, "అధికారం ఉందని, మద్దతు ఉందని ఏది మాట్లాడినా చెల్లుతుంది అనుకుంటే పొరపాటు," అని అన్నారు. "ఒకవేళ నీళ్లు ఉన్నవే అనుకుంటే, కేంద్ర జలవనరుల కమిషన్, గోదావరి నది నిర్వహణ బోర్డు, పర్యావరణ మంత్రిత్వ శాఖలు ఎందుకు బనకచర్ల ప్రాజెక్టు డీపీఆర్‌ను తిరస్కరించాయి? నాలుగు కేంద్ర సంస్థలు తిరస్కరించిన ప్రాజెక్టుకు అనుమతులు రావడమే ఎలా?" అని ప్రశ్నించారు. "గోదావరిలో తెలంగాణ వాటా ఎంత, ఆంధ్రప్రదేశ్ వాటా ఎంత? వాటిపై స్పష్టత లేకుండా మాట్లాడటం సరికాదు," అన్నారు.

### లోకేశ్ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు

"లోకేశ్ బనకచర్ల కట్టి తీరుతాం అంటున్నారు. కేంద్రం బలం, సీఎం రేవంత్ బలం చూసుకొని ధైర్యంగా మాట్లాడుతున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదు. సీఎం, మంత్రులు ఎవ్వరూ ఖండించలేదు. ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని ప్రశ్నించారు. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నారనే ఆరోపణలు అవాస్తవం.. "తెలంగాణ ప్రజలకు నీళ్లు రావాలంటే – అది ప్రాంతీయ విద్వేషమా? బతుకు దెరువు కోసం అడుగుతుంటే విమర్శించడం తగదు. బాబ్లీ ప్రాజెక్టుపై పోరాడిన మీ నాన్న గారి మాటల్ని గుర్తుంచుకోండి," అని హరీష్ రావు వ్యాఖ్యానించారు.

### బనకచర్ల ఆపే వరకు పోరాటం

"అవసరమైతే బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టుకు వెళుతుంది. బనకచర్లను కట్టి తీరుతాం అంటే, మేము అడ్డుకొని తీరుతాం. తెలంగాణ రాష్ట్రాన్ని ఎలా తెచ్చుకున్నామో మర్చిపోవద్దు," అని హరీష్ రావు హెచ్చరించారు. "కేంద్రం నీ చేతిలో ఉందని సీడబ్ల్యూసీని ఒప్పిస్తాం అనటం సరైనది కాదు. మేము లీగల్‌గా పోరాడతాం. బనకచర్ల ప్రాజెక్టును ఆపేందుకు అన్ని చట్టపరమైన మార్గాలను అనుసరిస్తాం," అని స్పష్టం చేశారు. "కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయన్న అనుమానం ఉంది" "లోకేశ్ ధైర్యంగా మాట్లాడుతున్నారు అంటే, కాంగ్రెస్, బీజేపీ సహకరించకపోతే సాధ్యమా? రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకోవడం కోసం, బీజేపీ ఢిల్లీలో తమ స్థానం కాపాడుకోవడం కోసం టీడీపీకి మద్దతు ఇస్తోంది," అని ఆరోపించారు.

### టీడీపీ కాళేశ్వరాన్ని అడ్డుకుంది

"కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు. దీన్ని పొక్క కొట్టేందుకు ప్రయత్నిం చడం సమంజసం కాదు. ఇది శ్రీశైలం కాదు, పోతిరెడ్డిపాడు కాదు. ఉమ్మడి రాష్ట్రం కాలం ముగిసిపోయింది. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం వుంది. బీఆర్ఎస్ పార్టీ వుంది," అని హరీష్ రావు స్పష్టం చేశారు. "లోకేశ్ మాట్లాడుతూ అనుమతులు లేవంటున్నారు. అది అ బద్ధం. ఒకటి కాదు, పదకొండు అనుమతులు వచ్చాయి. కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే నిర్మాణం మొదలైంది. అనుమానం ఉంటే ఆ లేఖల్ని చూపించగలం," అన్నారు. "కాళేశ్వరం ప్రాజెక్టును ఎప్పుడైనా అడ్డుకున్నామా అని లోకేశ్ అంటున్నాడు. మీ నాన్నను అడిగితే తెలుస్తుంది. అనుమతులొచ్చాక కూడా 2018లో చంద్రబాబు గారు 'రద్దు చేయండి, పనులు నిలిపేయండి' అని కేంద్రానికి లేఖలు రాశారు. మొత్తం ఏడుసార్లు వ్యతిరేక లేఖలు పంపారు. ఇప్పుడు మాత్రం మేమేమీ వ్యతిరేకించలేదు అంటున్నారు. ఇది ప్రజల్ని తప్పుదారి పట్టించడం," అని విమర్శించారు.



## రూ.59 లక్షల విలువైన నకిలీ కరెన్సీ స్వాధీనం

**ముంబాయి :** మహారాష్ట్రలో నకిలీ నోట్ల ముఠా గుట్టు రట్టయింది. రూ.59.50 లక్షల విలువైన నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ముఠాలోని ఏడుగురు సభ్యుల్ని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జులై 27న అహల్యనగర్ జిల్లాలోని అంబిల్‌వాడీ పోలీస్‌స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిఖిల్ శివాజీ గంగార్డే, సోమనాథ్ శిందేని అదుపులోకి తీసుకొని విచారించగా.. వారి వద్ద రూ.80వేల నకిలీ నోట్లు లభ్యమయ్యాయి. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా.. ఈ ముఠాలోని మిగతా సభ్యుల వివరాలు, నకిలీ నోట్లు బయటకొచ్చాయి. నిందితుల నుంచి నకిలీ నోట్లను ముద్రించడానికి ఉపయోగించిన రూ.2.16 కోట్ల విలువైన కాగితాన్ని, సిరాను పోలీసులు సీజ్ చేశారు. అరెస్టైన వారిలో ఓ వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరించి నకిలీ నోట్ల కోసం కస్టమర్‌ను తీసుకొచ్చాడని పోలీసు అధికారి ప్రహ్లాద్ గిట్ తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడు అంబాదాస్ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

## కేపీహెచ్‌బీలో 17వ అంతస్తు నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య



**హైదరాబాద్:** నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీ పీఎస్ పరిధిలో విషాదం చోటు చేసుకుంది. 17వ అంతస్తు నుంచి దూకి విద్యార్థిని (13) బలవన్మరణానికి పాల్పడింది. గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, మృతురాలి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ మూడో ఫేజ్‌లోని మంజీరా ట్రినిటీ హోమ్స్ 17వ అంతస్తులో బాలిక కుటుంబం నివసిస్తోంది. బాలిక కేపీహెచ్‌బీ ఠాణా వెనుక అడ్డగుట్ట ప్రాంతంలోని ఓ ప్రైవేట్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. గురువారం పాఠశాలలో తల్లిదండ్రులు, టీచర్ల సమావేశం జరిగింది. దానికి విద్యార్థిని తల్లి హాజరయ్యారు. సరిగా చదవడం లేదని, ఏకాగ్రత పెట్టడం లేదంటూ ఉపాధ్యాయులు తల్లికి తెలిపారు. ఇంటికి వచ్చాక టీచర్ మందలింపు విషయాన్ని బాలిక తన తండ్రితో చెప్పింది. భోజనం చేస్తున్న సమయంలో తండ్రి మాట్లాడుతూ బాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం బాలిక తన గదిలోకి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు హాల్లోనే కొంత సేపు మాట్లాడుకుని వారూ నిద్రించారు. రాత్రి 10.30 గంటల సమయంలో గేటెడ్ కమ్యూనిటీ అధ్యక్షుడు బాలిక తండ్రికి ఫోన్ చేసి మొదటి అంతస్తుకు రావాలని చెప్పారు. ఎందుకని అడిగినా ఆయన చెప్పలేదు. దీంతో ఆయనకు సందేహం వచ్చి బాలిక గది డోర్ కొట్టగా లోపలి నుంచి లాక్ చేసి ఉంది. మరో తాళంతో తెరవగా గదిలో బాలిక లేదు. వాష్‌రూమ్‌లో కిటికీ తెరిచి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే మొదటి అంతస్తుకు వెళ్లి చూడగా మృతదేహం ఉంది. 17వ అంతస్తు నుంచి దూకడంతో బాలిక ఎడమ కాలు విరిగి పక్కనే పడి ఉంది. మృతదేహాన్ని చూసి తల్లి గుండెలవిసేలా రోదించింది. ఈ ఘటనతో అపార్ట్‌మెంట్ వాసులు భయాందోళనకు గురయ్యారు. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.



## రాహుల్‌ది భారత్ వ్యతిరేక భాష

- ఎవరి మెప్పుకోసం ఈ విపరీత వ్యాఖ్యలు
- రాహుల్ తీరుపై మండిపడ్డ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 1 :** రాహుల్ భారత్ వ్యతిరేక భాషను ఉపయోగించి ఎన్నికల సంస్థను కించపరిచారని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. దేశ ఆర్థిక స్థితిని 'డెడ్ ఎకానమీ'గా అభివర్ణించడాన్ని ప్రతిపక్ష సభ్యులే వ్యతిరేకిస్తున్నారన్నారు. ఆయన ఎవరి మెప్పు కోసం ఇలాంటి విపరీత వ్యాఖ్యలు చేస్తున్నారో తెలియదని అన్నారు. భాజపా కోసం ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని.. దాన్ని రుజువు చేసేందుకు తమ వద్ద అణు బాంబు లాంటి ఆధారాలున్నాయని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షంలోని నాయకులే రాహుల్ ఉపయోగించిన భాషను వ్యతిరేకిస్తున్నారు. దేశ ఆర్థిక స్థితిని డెడ్ ఎకానమీగా మీరెలా చెప్పగలరని ప్రశ్నిస్తున్నారు. రాహుల్ చిన్న పిల్లాడు కాదని, ప్రతిపక్షనాయకుడి హోదాకు తగ్గట్టుగా వ్యవహరించాలని రిజిజు సూచించారు. అధికారులను బెదిరించడం, దేశానికి వ్యతిరేకంగా మాట్లాడటం సరికాదన్నారు. ఉద్దేశపూర్వకంగా పార్లమెంటు కార్యకలాపాలను అడ్డుకోవడం వల్ల అంతిమంగా ఓడిపోయేది ప్రతిపక్ష ఎంపీలే అని రిజిజు వ్యాఖ్యానించారు. 'ప్రతిపక్షం సభను పనిచేయనివ్వడం లేదు. ప్రజల సమస్యలను లేవనెత్తలేని ఎంపీలకు అధిక నష్టం జరుగుతుందని అన్నారు. చర్చలు పార్లమెంటరీ నియమాల ప్రకారం జరగాలని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ– ఛైర్మన్ ఇద్దరూ స్పష్టం చేశారని రిజిజు అన్నారు. ప్రతిపక్ష నేత దేశానికి హాని కలిగించే ప్రమాదకరమైన ఆట ఆడుతున్నారని మండిపడ్డారు.




## ఏపీ మద్యం కుంభకోణం..

### నిందితులకు రిమాండ్ పొడిగింపు

**అమరావతి:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. ఈ నెల 13 వరకు రిమాండ్ విధిస్తున్నట్లు తెలిపింది. ఈ కేసులో ఇప్పటి వరకు 12 మంది నిందితులను అరెస్టు చేశారు. మద్యం కుంభకోణం కేసులో నిందితుల రిమాండ్ నేటితో ముగియడంతో విజయవాడ జిల్లా జైలు నుంచి 9 మందిని సిట్ అధికారులు నుంచి కోర్టుకు తీసుకువెళ్లారు. ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, రాజ్ కెసిరెడ్డి, పైలా దిలీప్, వెంకటేష్ నాయుడు, బూనేటి చాణక్య, బాలాజీ గోవిందప్ప, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి ఇక్కడి నుంచి వెళ్లారు. గుంటూరు జిల్లా జైలు నుంచి ఇద్దరు, రాజమండ్రి జైలు నుంచి వైకాపా ఎంపీ మిథున్ రెడ్డిని కోర్టులో హాజరుపరిచేందుకు అధికారులు తీసుకొచ్చారు.

# నేను ఏ తప్పు చేయలేదు

- పోలీసుల విచారణలో నమ్రత
- సృష్టి కేసులో డాక్టర్ నమ్రత కస్టడీ విచారణ



**హైదరాబాద్, ఆగస్ట్ 1 :** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. శుక్రవారం డాక్టర్ నమ్రతను పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. సృష్టి కేసు వ్యవహారంలో తొలిరోజు కస్టడీలో భాగంగా డాక్టర్ నమ్రతను పోలీసులు విచారించారు. సుమారు ఐదు గంటలుగా నమ్రతకు గోపాలపురం పోలీసులు ప్రశ్నలు సంధించారు. నార్త్ జోన్ డీసీపీ కార్యాలయంలో విచారణ కొనసాగుతోంది. అయితే.. చైల్డ్ ట్రాఫికింగ్‌పై అడిగిన ప్రశ్నలకు నమ్రత నోరు మెదపడం లేదని సమాచారం. ఎటువంటి తప్పు చేయలేదంటూ సమాధానం చెబుతున్నట్లు తెలుస్తోంది. తాను ఎవరినీ బెదిరించలేదని, మోసం చేయలేదని పేర్కొంది. నిజనిజాలు త్వరలోనే బయటపడుతాయని పోలీసులతో నమ్రత చెప్పినట్లు– తెలుస్తోంది. నమ్రత ఏజెంట్లు, ఆశా వర్కర్ల పాత్రపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఒక్కొక్క దంపతుల వద్ద ఎంత పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ప్రశ్నిస్తున్నారు. విజయవాడ, వైజాగ్, హైదరాబాద్ సృష్టి ఫెర్టిలిటీ– బ్రాంచీలపై వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటివరకూ ఎంతమంది తల్లిదండ్రులకు పిల్లలను సరోగసి పేరుతో విక్రయాలు జరిపారు..? న్యాయవాది వృత్తి పేరుతో కొడుకు జయంత్ కృష్ణ బాధితులను బెదిరించడంపై పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఫెర్టిలిటీ సెంటర్లో నమోదు చేసుకున్న తల్లిదండ్రుల వివరాలపైనా ఆరా తీస్తున్నారు. ఎలాంటి పశ్చాతాపం లేకుండా పిల్లలను దత్తతకు అరేంజ్ చేశామని బహిరంగంగానే నమ్రత చెబుతున్నట్లు– సమాచారం. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలో ఖైదీగా ఉన్న డాక్టర్ నమ్రతను శుక్రవారం పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ఐదు రోజులపాటు– నమ్రతను గోపాలపురం పోలీసులు విచారించనున్నారు. నమ్రతపై హ్యూమన్ ట్రాఫికింగ్‌తోపాటు– పలు కేసులు నమోదు అయ్యాయి. పిల్లలు లేని దంపతులను టార్గెట్‌గా చేసుకుని భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించారు. సృష్టి ఫెర్టిలిటీ– సెంటర్లో సరోగసి మాటు–న శిశువుల విక్రయాలు, అలాగే ఇతరుల స్పర్మ్ తో పిల్లలు పుట్టేలా చేశారనే ఆరోపణలపై డాక్టర్ నమ్రతను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

## అవినీతి అధికారులపై ఫిర్యాదు చేయండి

- లంచం అడిగితే సమాచారం ఇవ్వండి
- గత నెలలోనే 22 కేసులు నమోదు
- ఏసీబీ అధికారుల వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 1 :** ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది లంచం డిమాండ్ చేస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం హైదరాబాద్‌లో సూచించారు. అవినీతిని నిరోధించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. అందులో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు, స్టిక్కర్లు ద్వారా అవినీతికి వ్యతిరేకంగా ఫిర్యాదులు చేసేలా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. అయితే రాష్ట్రంలో అవినీతి అధికారులపై మెరుపు దాడులు చేసినట్లు చెప్పారు. ఆ క్రమంలో 2025 జులై మాసంలో మొత్తం 22 అవినీతి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆ జాబితాలో ట్రాప్ చేయడం, లెక్కకు మించిన ఆదాయం కలిగి ఉండడం, క్రిమినల్ మిస్ కండక్ట్ తదితర కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. ట్రాప్ కేసుల్లో రూ.5.75 లక్షలు, లెక్కకు మించిన ఆదాయం కేసులో రూ.11.5కోట్ల విలువైన ఆస్తులు వెలుగులోకి వచ్చాయన్నారు. అలాగే ఆర్టీఏ, చెక్ పోస్టులు, సబ్ రిజిస్ట్రార్ తదితర కార్యాలయాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు– తెలిపారు. ఆ సమయంలో లెక్కల్లోకి రాని రూ.1.49 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అయితే ఈ ఏడాది జనవరి నుంచి జులై మాసం వరకు 148 కేసులు నమోదు చేసినట్లు– తెలిపింది. ఈ కేసులో ప్రమేయం ఉన్న మొత్తం 145 ప్రభుత్వ ఉద్యోగులు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని అరెస్ట్ చేశామన్నారు. అలాగే మొత్తం రూ.30.32 లక్షలు ట్రాప్ కేసుల్లో స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. లెక్కకు మించిన ఆదాయం కేసుల్లో ఆస్తుల విలువ రూ.39కోట్లకు పైగా ఉందన్నారు. మరోవైపు నీటి పారుదల శాఖలో పలువురు ఇంజనీర్లు.. ఇంజనీర్ ఇన్ చీఫ్ మరళీధర్ రావు, నూనె శ్రీధర్‌తోపాటు– మరో ఇంజనీర్ హరిరామ్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ముగ్గురు అధికారుల వద్దే దాదాపు రూ.1000 కోట్లకు పైగా అవినీతి నగదు ఉన్నట్లు– ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు నిర్ధారించారు.



## బిహార్‌లో ముసాయిదా జాబితా

### 65లక్షల ఓటర్లు 'మిస్సింగ్'

**బిహార్ :** బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తైన నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ముసాయిదా జాబితా విడుదలయ్యింది. ఇందులో మొత్తంగా 65లక్షల ఓటర్లను చేర్చలేదని వెల్లడైంది. ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టక ముందు రాష్ట్రంలో మొత్తం నమోదిత ఓటర్ల సంఖ్య 7.9 కోట్లుగా ఉండగా, తాజా ముసాయిదాలో అది 7.24కోట్లకు తగ్గింది. రాజధాని పట్నాలో అత్యధికంగా 3.95లక్షలు, మధుబనీలో 3.52లక్షలు, ఈస్ట్ చంపారన్‌లో 3.16లక్షలు, గోపాల్‌గంజ్‌లో 3.10లక్షల ఓటర్లు సంబంధిత దస్త్రాలను అందించకపోవడంతో వారిని ఈ జాబితాలో చేర్చలేదని ఈసీ వెల్లడించింది. మొత్తం జాబితాలో 22.34 లక్షల మంది ఓటర్లు చనిపోయారని, 36.28లక్షల మంది ఇతర ప్రాంతాలకు తరలివెళ్లడం లేదా ఆయా చిరునామాలో లేరని ఈసీ గుర్తించింది. మరో 7.01 లక్షల మంది ఒకటి కన్నా ఎక్కువసార్లు నమోదు చేసుకున్నట్లు గుర్తించామని తెలిపింది. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోన్న వేళ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను ఎన్నికల సంఘం చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ ప్రక్రియ పూర్తైన నేపథ్యంలో ముసాయిదా జాబితాను ఈసీ శుక్రవారం విడుదల చేసింది. దీనిని ప్రధాన రాజకీయ పార్టీలకు అందజేసింది. తాజాగా ఓటర్లకు కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 1లోగా ఈసీకి తెలియజేయవచ్చు. ఆ తర్వాత ఓటరు తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రచురిస్తుంది. ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్, ఆర్జేడీ వంటి విపక్ష పార్టీలు ఈ ముసాయిదాపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఎన్డీయేకు అనుకూలంగా ఉండేందుకే దీన్ని చేపట్టాయని ఆరోపిస్తూ రాజధాని పట్నాలో నిరసన తెలిపాయి.



## పెళ్లికాని డబ్బున్న వ్యక్తులే ఆమె లక్ష్యం

### తొమ్మిదో పెళ్లి కోసం ప్రయత్నించి పోలీసుల చేతికి..

**నాగ్‌పూర్:** పెళ్లికాని డబ్బున్న వ్యక్తులే ఆమె లక్ష్యం. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో వారి వివరాలు సేకరిస్తుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్ పెడుతుంది. ఆ తర్వాత తనకు విడాకులయ్యాయని, ఓ బిడ్డ కూడా ఉన్నట్లు అవతలి వాళ్లకు ఎమోషనల్‌గా దగ్గరవుతుంది. చివరికి వివాహం చేసుకుంటుంది. ఇలా ఒకటి, రెండు కాదు.. ఏకంగా 8 పెళ్లిళ్లు చేసుకుంది. తొమ్మిదో పెళ్లి కోసం పావులు కదుపుతూ పోలీసులకు చిక్కింది. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌నకు చెందిన ఆమె బాగోతం తాజాగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సమీరా ఫాతిమా ఉపాధ్యాయిని. ఎక్కువగా డబ్బు సంపాదించేందుకు ఆమె తప్పుడు మార్గాన్ని ఎంచుకుంది. వయస్సు మీదపడుతున్నా పెళ్లికాని ధనవంతులను లక్ష్యంగా చేసుకుంది. సామాజిక మాధ్యమాల్లో వారికి దగ్గరై.. విధిలేని పరిస్థితుల్లో విడాకులు తీసుకోవాల్సి వచ్చిందని, ఓ బిడ్డతో కలిసి ఒంటరిగా ఉంటున్నట్లు చెబుతుంది. చివరికి ముగ్గులో దించి పెళ్లి చేసుకుంటుంది. కొన్ని రోజులు గడిచాక.. పథకం ప్రకారం వారి నుంచి డబ్బు డిమాండ్ చేస్తుంది. అవసరమైతే బెదిరించి బలవంతంగా వసూలు చేసేందుకు ఆమెకు ప్రత్యేక గ్యాంగ్ కూడా ఉంది. ఇలా గత 15 ఏళ్లల్లో 8 పెళ్లిళ్లు చేసుకొని.. వారి నుంచి భారీ మొత్తంలో డబ్బు గుంజుకుంది. సమీర తన నుంచి రూ.50 లక్షలు బలవంతంగా వసూలు చేసిందని ఆమె భర్తల్లో ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దర్యాప్తులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఆమె బాధితుల్లో రిజర్వ్‌బ్యాంక్ సీనియర్ అధికారులు కూడా ఉండటం గమనార్హం. అయితే, 8 మంది భర్తల నుంచి డబ్బులు వసూలు చేసిన నిందితురాలు.. మరో పెళ్లి చేసుకునేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో జులై 29న నాగ్‌పుర్‌లోని ఓ టీ దుకాణం వద్ద ఆ వ్యక్తిని కలిసేందుకు వచ్చిన ఆమెను.. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## సంపాదకీయం

# విపత్తు సాయం కోసం ప్రత్యేక దళం!



విపత్తుల సమయంలో సకాలంలో స్పందించేలా వ్యవస్థను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉంది. విపత్తు నిర్వహణకు కూడా ఆర్మీలాంటి దళాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తే మంచిది. భూకంపాలు, అగ్నిప్రమాలు, వరదలు లాంటి ప్రమాదాల సమయాల్లో తక్షణం స్పందించేలా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. దేశంలో ఎక్కడ ఏ మూల ప్రమాదం జరిగినా సహాయక చర్యలకు దిగేలా తీర్చిదిద్దాలి. ఇలాంటి దళాలను ఏర్పాటు చేయడంతో పాటు,ఆర్థిక సంపత్తిని కూడా కట్టిబెడితే మంచిది. దీనిద్వారా విపత్తు నిర్వహణతో పాటు, నిరుద్యోగ సమస్యకూడా కొంతమేర తీరవచ్చు. విపత్తు నిర్వహణ అన్నది ఉమ్మడి వ్యవహారంగా ఉంటనే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తక్షణం ఆదుకునేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీనికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసుకోవాలి. ప్రత్యేకంగా నిధులను సమకూర్చాలి. లేదా కేంద్ర,రాష్ట్రాలు ఉమ్మడిగా నిధులు సమకూర్చాలి. అలాగే దీనిని సైన్యంలో ఒక భాగంగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. భారత్ లాంటి దేశానికి ఇది తక్షణావసరమని పాలకులు గుర్తించాలి. ఇప్పటివరకు జరిగిన అనేక విప్తతులను దృష్టిలో పెట్టుకుని తగిన తర్ఫీదు ఇచ్చి స్వయం శక్తిగా దీనిని రూపొదించాలి. దేశంలో ఎక్కడ ఏ మూలన ఎలాంటి ఉపద్రవం వచ్చిపడినా తక్షణం రంగంలోకి దిగేలా అన్ని రాష్ట్రాల్లో సన్నద్ధంగా ఉండేలా చూడాలి. ఈ దిశగా ఆలోచ నలు చేసి ఆచరణకు సిద్ధపడాలి. ఎన్డీఆర్ఎఫ్ దళాలు ఉన్నా దానిని మరితంగా పటిష్టం చేయాలి. దీనికి ఆర్మీ తరహా వ్యవస్థ అవసరం ఉంది. దేశంలో ఏ మూల ఎలాంటి ఉపద్రవం ముంచుకుని వచ్చినా సకాలంలో చేరుకుని సేవలు అందించే విధంగా తయారు కావాల్సి ఉంది. రైలు ప్రమాదాలు కావచ్చు.. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో సకాలంలో సత్వర సేవలు అందించే వీలు కలుగుతుంది. ఇటీవలి వరదలు, రైలు ప్రమాదాలు చూశాక శిక్షిత సిబ్బందంది అవసరముందని తెలుస్తోంది. దానికి సాంకేతికంగా సహాయ సహకారం అందించాలి. ప్రస్తుతానికి విపత్తులను ఎదుర్కోవడంలో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరించిన మార్గాలే ఇప్పుడు శరణ్యంగా మారాయి. ఈ దుస్తితి పోవాలంటే ఓ అత్యున్నత వ్యవస్థ అవసరం అన్నది గుర్తించాలి. కేంద్రరాష్ట్రాలు ఇందుకు ముందుకు రావాలి.

ఉమ్మడిగా వ్యవస్థను తయారు చేసుకోవాలి. దీనిని ఆర్మీలో భాగంగా చేస్తే మరీ మంచిది. సాధారణ ఆర్మీ ఇలాంటి సమయాల్లో అంతగా పనిచేయకపోవచ్చు. కానీ అప్పుడు ఎక్కడ ఏ ఉపద్రవం వచ్చినా రంగంలోకి దిగేలా అవకాశం ఉంటుంది. ఏటా దేశవ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా వరదలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాల మూలంగా పెద్దయెత్తున నీరు వచ్చి చేరుతుండడంతో ప్రధానమైన డ్యాముల గేట్లను తెరవాల్సి రావడంతో దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకుని విలవిల్లా డుతున్నాయి. విపత్తుల సమయంలో స్వతంత్ర వ్యవస్థ రంగంలోకి దిగి ప్రజలను కాపాడడంతో పాటు, సహయాక చర్యల్లో నిమగ్నమయ్యేలా ఉంటే విమర్శలకు ఆస్కారం ఉండదు. హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, కేరళ తమిళనాడు, తెలంగాణ, ఎపిల్లో ఏటా కుండపోతగా కురుస్తున్న వర్షాలతో ప్రజాజీవనం అతలాకుతలం అవుతున్నాయి. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, విరిగిపడుతున్న కొండ చరియలు, తెగిపోయిన రోడ్లు సాధారణ పౌర జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. లోతట్టు ప్రాంత ప్రజలను సకాలంలో సహాయక శిబిరాలకు తరలించడం, ప్రాణనష్టాన్ని తగ్గించగలగడం అన్నది ఇలాంటి సమయాల్లో ముఖ్యం. పునరావాస శిబిరాల్లో బాధితులకు మంచినీరు, ఆహారం, మందులు వంటి కనీస సదుపాయాలు కల్పించడం, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం కూడా ముఖ్యమే. ప్రత్యేక యంత్రాంగం ఉండివుంటే వెంటనే రంగంలోకి దిగి యుద్ధ ప్రాతిపదికపై సహాయక చర్యలు చేపట్టే వీలుంటుంది. ప్రస్తుత వ్యవస్థలో ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా బయటకు తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర విపత్తు, సహాయక బృందాలు ప్రశంసనీయమైన కృషిచేస్తున్నాయి. అయితే ఇందులో ప్రధాన భూమిక రాష్ట్రాలదిగానే ఉంటోంది. అలాగాకుండా వ్యవస్థ ఉంటే సాయం కోసం కేంద్రంవైపు చూడాల్సిన ఆగత్యం రాదు. ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు, సహకార సంఘాలు, చలన చిత్ర పరిశ్రమ, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు ఉదారంగా ముందుకు వచ్చి విరాళాలందిస్తున్నారు. అయితే ఏటా ఎక్కడో ఓ చోట ఇలాంటి విపత్తులు సర్వ సాధారణంగా మారిన దశలో ప్రత్యేక,శాశ్వత ఏర్పాటు అవసరాన్ని గుర్తించాలి. అసాధారణ వరదలు కావడంతో పెద్దయెత్తున ఆస్తినష్టం కలిగించాయి.

ఇటీవలి వరదల్లో వేల ఎకరాల్లో పంటలు తుడిచి పెట్టుకునిపోయాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ, సహాయక అథారిటీని పటిష్టపరచినప్పటికీ ఇప్పుడు సంభవించిన విపత్తు అసాధారణమైనది. దీనిని ఎదుర్కోవడం అంత తేలికేమీ కాదు. అయినా, పరిస్థితి తీవ్రతకు మించిన వేగంతో ప్రభుత్వం కదిలింది. నదికి ఇరువైపులా వున్న ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసింది. ఇకపోతే విపత్త బృందం ఉంటే నష్టం అంచనా కూడా వెంటనే గుర్తిం చవచ్చు. లేకుంటే కేంద్రబృందం ఎప్పుడో నెల తరవాత రావడం...పోటోలు చూడడం.. అంచనా వేయడం జరుగుతోంది. అలా గాకుండా వెంటనే నష్టం అంచనాలు కూడా జరిగి పోవాలి. సహాయక చర్యలతో పాటు పునరావాస చర్యల్లో కూడా ఈ బృందాలు పాల్గొనేలా చేయాలి. ఇలా చేస్తే మంచి ఫలితాలతో పాటు సకాలంలో సాయం అందగలదు.

# యాదాద్రి థర్మల్ కేంద్రం జాతికి అంకితం

- మొదటి యూనిట్ గ్రిడ్‌కు అనుసంధానం
- 800 మెగవాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్ ప్రారంభం



**నల్లగొండ, ఆగస్ట్ 1 :** నల్గొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం లోని 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థం కలిగిన మొదటి యూనిట్ అందుబాటులోకి వచ్చింది. దీనిని జాతికి అంకితం చేశారు. మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ శుక్రవారం నాడిక్కడ జరిగినకార్యక్రమంలో జాతికి అంకితం చేశారు. కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. అంతకుముందు యాదాద్రి థర్మల్ విద్యుత్కేం ద్రంలో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు మంత్రులు శంకుస్థాపన చేశారు. 55 ఎకరాల్లో రూ.970 కోట్లతో టౌన్‌షిప్‌ను నిర్మించనున్నారు. వనమహోత్సవంలో భాగంగా మంత్రులు ఇక్కడ మొక్కలు నాటారు. అనంతరం భూనిర్వాసితులతో మాట్లాడారు. ఆగస్టు 15 లోపు వారికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం 2015లో 800 మెగావాట్ల సామర్థం గల 5 కేంద్రాల నిర్మాణం చేపట్టింది. 2017లో పనులు ప్రారంభించారు. సుమారు రూ.30వేల కోట్ల అంచనా వ్యయం కాగా మరో రూ.5వేల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండో యూనిట్‌ను గతేడాది డిసెంబరు 7న సీఎం ప్రారంభించారు. ఇప్పుడు ఒకటో యూనిట్‌ను జాతికి అంకితం చేసి పవర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. 3, 4వ యూనిట్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానున్నాయి. 5వ యూనిట్ 2026 మార్చిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్లాంటుకు మూడు కిలోమీటర్ల సమీపంలో దుబ్బతండా వద్ద ఉద్యోగుల నివాస సముదాయాల కోసం సుమారు 60 ఎకరాల్లో మెగా టౌన్‌షిప్ నిర్మించనున్నారు.

# అలా ఎన్‌కౌంటర్ నుంచి బయటపడ్డా

## ఆనాటి ఘటనపై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, ఆగస్ట్ 1 :** తనను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ చేయాలని ప్లాన్ చేసినట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ టీవీ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. నాడు జరిగిన సంచలన విషయాలను వివరించారు. తాను హిందువాహినిలో చేరి యువతను ధర్మం వైపు ఆకర్శితులయ్యేలా కార్యక్రమాలు చేపట్టానని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో తమ కార్యక్రమాలకు ఎప్పుడూ ఏదో ఒక గొడవ సృష్టించేవారని, తాము ఎక్కడికి వెళితే అక్కడ 144 సెక్షన్ అమలు చేసేవారని రాజాసింగ్ తెలిపారు. ఎవరైనా హిందువులను మతం మార్చాలని ప్రయత్నిస్తే తాము అడ్డుకునే వాళ్లమన్నారు. మా వల్ల ఏదో ఒక గొడవ జరుగుతోందని అప్పటి కాంగ్రెస్ గవర్నమెంట్ కుట్రలు చేసింది. లేనిపోని కేసులు పెట్టి జైలుకు పంపారు. అప్పుడు కూడా ఆగలేదు. జైలుకు వెళ్లాం బయటకు వచ్చాం. మళ్లీ ధర్మం కోసం కార్యక్రమాలు చేశామని తెలిపారు. ఇలా ఎన్‌కౌంటర్ మిస్టరీని కూడా బయటపెట్టారు. కాంగ్రెస్ హయాంలో మమ్మల్ని ఎన్‌కౌంటర్ చేయాలని ప్లాన్ చేశారని రాజాసింగ్ తెలిపారు. నన్ను, నాతో పాటు– ఓ హిందూవాహిని కార్యకర్తను అడివిలోకి తీసుకెళ్లారు. ఎన్‌కౌంటర్ చేయడానికి ప్లాన్ చేశారు. నన్ను ఎన్‌కౌంటర్ చేయబోయే పోలీస్ కట్టర్ హిందు. నా గురించి ఆయనకు తెలియదు. ఉన్నతాధికారులు నన్ను ఎన్‌కౌంటర్ మాత్రమే చేయాలని ఆయనకు చెప్పారు. ఆ పోలీసు నన్ను అడవిలోకి తీసుకెళ్లి జీపు నుంచి కిందికి దింపారు. పరిగెత్తమని చెప్పాడు. ఆయన తన గన్ లోడ్ చేసుకుంటున్నాడు. అప్పుడే నాకు అర్థం అయ్యింది నన్ను ఎన్‌కౌంటర్ చేస్తారని.. 'ఉరకడం ఎందుకు సార్.. ఇక్కడే కాల్చేయండి.' అని నేను ఆ పోలీసు అధికారికి చెప్పాను. ధర్మం కోసం చావాలనే మా కల ఇక్కడే చంపేయండి అని చెప్పాను. దీంతో ఆ పోలీసు అధికారి ఆలోచనలో పడ్డారు. వీళ్లు ధర్మం గురించి మాట్లాడుతున్నారేంటి? అని ఆలోచించారు. ఇంతకు మీరు ఎవరు? అని ఆ ఆఫీసర్ అప్పుడు మమ్మల్ని అడిగారు. దాదాపు రెండు గంటల పాటు– మా చరిత్ర ఆయనకు చెప్పాం. మిమ్మల్ని చంపి ఉంటే పెద్ద పాపం అయి ఉండేది అని ఆ పోలీస్ ఫీల్ అయ్యారు. దీంతో కొన్ని ఛానెల్స్‌కి ఆ పోలీసే స్వయంగా 'రాజాసింగ్‌ను ఎన్‌కౌంటర్ చేయబోతున్నారు.' అని మీడియాకు లీక్ చేశారు. దీంతో టీవీల్లో ఈ వార్త వచ్చింది. దీంతో నన్ను ఎవరైతే ఎన్‌కౌంటర్ చేయాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చారో వాళ్లే ఆపేయాలని ఈ అధికారికి ఫోన్ చేశారు. అలా ఎన్‌కౌంటర్ నుంచి బయట పడ్డామని రాజాసింగ్ సంచలన విషయాలు బయటపెట్టారు.

# సిఎం రేవంత్‌రెడ్డిపై కేసు కోట్టివేత

**హైదరాబాద్, ఆగస్ట్ 1 :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. భాజపా ఫిర్యాదుతో రేవంత్ రెడ్డిపై నమోదైన కేసును ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. గతేడాది మే 4న కొత్తగూడెంలో జరిగిన సభలో సీఎం ప్రసంగం వల్ల భాజపా పరువుకు భంగం కలిగిందని ఆ పార్టీ నేత కాసం వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. భాజపా రిజర్వేషన్లు రద్దు చేస్తుందని అన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల కోర్టు విచారిస్తున్న ఈ కేసును కొట్టివేయాలని రేవంత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేయగా.. విచారణ జరిపిన హైకోర్టు ఇవాళ ఆదేశాలు జారీ చేసింది.

## సైబర్ నేరాన్ని ఛేదించిన ఏపీ పోలీసులు

# రూ.41 లక్షలు రికవరీ

**అనంతపురం:** అనంతపురం జిల్లాలో తొలిసారిగా సైబర్ క్రైమ్ కేసులో పోలీసులు రూ.41 లక్షలు రికవరీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రాయదుర్గానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నరసింహప్ప ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడుతూ లాభాలు పొందేవాడు. ఈ క్రమంలో ఓ నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లో మొదట రూ.12లక్షలను పెట్టుబడిగా పెట్టాడు. దీనిపై రోజుల వ్యవధిలోనే రూ.5.50 లక్షల లాభం వచ్చింది. ఆ డబ్బును తీసుకున్న నర్సింహప్ప మళ్లీ ఒకేసారి తన ఖాతాలో ఉన్న రూ.1.74కోట్లను పెట్టుబడిగా పెట్టాడు. నగదు విత్‌డ్రా చేసుకోడానికి యత్నించగా యాప్ పనిచేయలేదు. దీంతో తాను మోసపోయాయని గ్రహించి రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కంబోడియా దేశంలో కీలక సైబర్ నేరగాడు వ్యవస్థను నడిపిస్తున్నాడని అనంతపురం పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.41 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అనంతపురంలో ఇంత పెద్ద మొత్తంలో నగదు రికవరీ చేసిన సైబర్ క్రైమ్ ఇది అని జిల్లా ఎస్పీ జగదీష్ తెలిపారు.



# కెటిఆర్, జగదీశ్ రెడ్డిలపై కేసు కొట్టివేత

**హైదరాబాద్, ఆగస్ట్ 1 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీష్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఇరువురిపై మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును న్యాయస్థానం కొట్టేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తనపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేశారని తీన్మార్ మల్లన్న ఫిర్యాదు మేరకు కేటీ–ఆర్, జగదీష్ రెడ్డిపై కేసు నమోదు చేశారు పోలీసులు. అయితే తమపై నమోదైన కేసును కొట్టేయాలని కేటీఆర్, జగదీష్ రెడ్డిహైకోర్టును ఆశ్రయించారు. గత కొన్ని నెలలుగా న్యాయస్థానంలో వాదనలు వినిపించారు ఇరువైపు న్యాయవాదులు. ఇరువైపులా వాదనలు ముగియడంతో గత నెల 11న తీర్పు రిజర్వ్ చేసింది హైకోర్టు. ఫేక్ వీడియోలపై ఎలాంటి ఆధారాలు లేవని తీన్మార్ మల్లన్న దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ మేరకు ఇవా(శుక్రవారం) కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కేటీఆర్, జగదీష్ రెడ్డికి భారీ ఉపశమనం లభించింది.

# గొర్రెల పథకంలో వెయ్యికోట్లకు పైగా అక్రమాలు

## దర్యాప్తులో గుర్తించిన ఈడీ అధికారులు

**హైదరాబాద్, ఆగస్ట్ 1 :** తెలంగాణలో సంచలనం సృష్టించిన గొర్రెల పంపిణీ పథకంలో రూ.వెయ్యి కోట్లకుపైనే అక్రమాలు జరిగినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించింది. గొర్రెల పెంపకం, అభివృద్ధి పథకం అమలులో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. ఈ మేరకు అవినీతిపై దృష్టి సారించారు. డబ్బు భారీగా చేతులు మారిన కారణంగా ఇడిరంగంలోకి దిగింది. గత ప్రభుత్వంలోని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఓఎస్డీగా ఉన్న జి. కల్యాణ్ కుమార్, ఇతర లబ్ధిదారులు, మధ్యవర్తుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అనేక ఆధారాలు సేకరించినట్లు– ఈడీ అధికారులు ప్రకటించారు. వివిధ ప్రభుత్వ అధికారులకు ముడుపుల రూపంలో అక్రమ చెల్లింపులు జరిగినట్లు– సూచించే పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. 200కుపైగా బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన చెక్‌బుక్‌లు, పాస్‌బుక్‌లు, డెబిట్ కార్డులు, 31 సెల్‌ఫోన్లు, 20 సిమ్‌కార్డులను సీజ్ చేశారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నివేదిక కూడా గొర్రెల పంపిణీలో కుంభకోణం జరిగినట్లు– గుర్తించింది. మార్చి 2021తో ముగిసిన కాలానికి సంబంధించిన కాగ్ నిర్వహించిన ఆడిట్‌లో పథకం అమలులో అనేక అవకతవకలు జరిగినట్లు వెల్లడైంది. లబ్ధిదారుల వివరాలను సరిగ్గా నిర్వహించకపోవడం, రవాణా ఇన్వాయిస్ రికార్డులు అసంపూర్ణంగా ఉండటం, నకిలీ వాహన నంబర్లతో కూడిన ఇన్వాయిస్‌కు చెల్లింపులు చేయడం వంటివి గుర్తించారు. మొత్తం తెలంగాణవ్యాప్తంగా రూ.వెయ్యి కోట్లకుపైగా అక్రమాలు జరిగాయని ఈడీ అంచనా వేసింది.



# రాహుల్ గాంధీ వ్యాఖ్యల్ని తప్పుబట్టిన శశిథరూర్

**న్యూఢిల్లీ :** భారత్, రష్యా సంబంధాలపై అక్కసు వెళ్లగక్కుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమర్థించడాన్ని సొంత పార్టీ ఎంపీ శశిథరూర్ తప్పుబట్టారు. రాహుల్ వ్యాఖ్యలతో విభేదిస్తున్నానని చెప్పారు. భారత్, రష్యా ఆర్థిక వ్యవస్థలు ఇప్పటికే పతనమయ్యాయని, వాటిని మరింత దిగజార్చుకోనీయండంటూ ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ట్రంప్ విమర్శలను శశిథరూర్ కొట్టిపారేశారు. భారత ఆర్థిక స్థితి ఎలా ఉందో అందరికీ తెలుసన్నారు. ట్రంప్‌ను రాహుల్ సమర్థించడంపై పార్లమెంట్ వెలుపల మీడియా ప్రశ్నించగా ఈ మేరకు స్పందించారు. రష్యాతో భారత్ ఏం చేస్తుందన్న విషయాన్ని అసలు పట్టించుకోబోమని, వారిద్దరూ మునిగిపోతుంటే మాకెందుకని, మిగిలిన అందరి గురించి పట్టించుకుంటామని ట్రంప్ పోస్టు చేసిన విషయం తెలిసిందే. "భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలున్నప్పటికీ.. ఆ దేశంతో స్వల్ప లావాదేవీలే ఉన్నాయి. ఆ దేశం విధిస్తున్న సుంకాలు ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్నాయి. ఉక్రెయిన్‌లో దాడులు ఆపాలని ప్రపంచమంతా గొంతెత్తి అరుస్తుంటే.. భారత్ మాత్రం రష్యా నుంచి ఆయుధాలను, ఇంధనాన్ని కొనుగోలు చేస్తోంది" అని ట్రంప్ చిర్రుబుర్రులాడారు. ఆ పోస్టుపై రాహుల్ స్పందిస్తూ.. భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందంటూ ట్రంప్ నిజం మాట్లాడారని అన్నారు. దీనిపై అధికార పక్షం నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్‌కు చెందిన మరో ఎంపీ కార్తి చిదంబరం కూడా రాహుల్ వ్యాఖ్యలను సమర్థించలేదు. కానీ, ట్రంప్ ఓ సంప్రదాయేతర రాజకీయ నాయకుడంటూ చురకలు అంటించారు.

# బీఎస్‌ఎన్‌ఎల్ ఫ్రీడమ్ ప్లాన్

## రూ.1కే 30 రోజుల అన్‌లిమిటెడ్ కాల్స్

**ముంబయి :** ప్రభుత్వరంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కొత్త ప్లాన్‌ను తీసుకొచ్చింది. 'బీఎస్ఎన్ఎల్ ఆజాదీ కా ప్లాన్' పేరిట దీన్ని లాంచ్ చేసింది. ఇందులో భాగంగా కేవలం రూ.1కే 30 రోజుల అపరిమిత సేవలను అందిస్తుంది. ఈ ఆఫర్ కొత్త వినియోగదారులకు మాత్రమే! ఈ మేరకు బీఎస్ఎన్ఎల్ ఎక్స్‌లో పోస్టు చేసింది. ఈ ప్లాన్‌లో భాగంగా రూ.1కే 30 రోజుల పాటు అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు, రోజుకు 2జీబీ డేటాను బీఎస్ఎన్ఎల్ అందిస్తోంది. సిమ్ కూడా ఫ్రీ. ఈ ఆఫర్ ఆగస్టు 1 నుంచి 31 వరకు చెల్లుబాటులో ఉంటుంది. ఆసక్తి గల వినియోగదారులు ఈ ఆఫర్ కోసం సమీపంలోని బీఎస్ఎన్ఎల్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)కు లేదా రిటైలర్‌ను సందర్శించొచ్చు. కొత్త వినియోగ దారులను ఆకర్షించడానికి, 4జీ సేవలను విస్తరించడమే లక్ష్యంగా సంస్థ ఈ ప్లాన్‌ను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.



## హిందీ పండిట్ ప్రవీణ్ కుమార్‌ను
# వెంటనే సస్పెండ్ చేయాలి
### ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గోటూరి చరణ్ గౌడ్



**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:** విద్యార్థినిల పట్ల అనుచితంగా ప్రవర్తించిన హిందీ పండిట్ ప్రవీణ్ కుమార్ ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి గోటూరి చరణ్ గౌడ్ విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. మొయినాబాద్ మండల పరిధిలోని వెంకటాపూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ పండిత్ గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్ ను వెంటనే విధుల నుంచి తొలగించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మొయి నాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ మాట్లాడుతూ...విద్యార్థినిల పట్ల అసభ్యక రంగా ప్రవర్తించి, చెడు పదజాలంతో దూషించిన హిందీ పండిట్ ప్రవీణ్ కుమార్. ఈ విషయంపై డిఇఓ పాఠశాలను సందర్శించి, విచారణ చేపట్టి, వెంటనే అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామనని హెచ్చరించారు. గత విద్యా సంవత్సరం విద్యార్థినిల తల్లిదండ్రులు షీ టీం కు ఫిర్యాదు చేయగా వారు కేసు కూడా నమోదు చేయడం జరిగిందని, అయినా ఆయనలో ఎలాంటి మార్పు లేకపోగా, అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు లేకపోవడం బాధాకరం అని అన్నారు. కాబట్టి వెంటనే హిందీ పండిట్ ప్రవీణ్ కుమార్ ను విధుల నుంచి తొలగించాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని, విద్యాశాఖ అధికారులను హెచ్చరించారు.




## కుమారుడి పుట్టిన రోజున
# విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

- చేవెళ్ల డివిజన్ నినాదం రిపోర్టర్ నరేందర్ చేయూత
- పాల్గొన్న ఎంఈఓ లక్ష్మణ్

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంఈఓ లక్ష్మణ్, చేవెళ్ల డివిజన్ నినాదం రిపోర్టర్ నరేందర్ లు అన్నారు. శుక్రవారం నరేందర్ కుమారుడు అయాన్ సిద్ధార్థ్ పుట్టినరోజు సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ మండల పరిధి నాగర్ గూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 50 మంది పైగా విద్యార్థులకు నోటు బుక్స్, పెన్నులు, ఐడి కార్డు, ప్రభుత్వ పాఠశాల లోగో బెల్టులు ఎంఈఓ లక్ష్మణ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ... డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనల విధానంలో భాగంగా పే బ్యాక్ సొసైటీ నినాదంతో ముందుకు సాగుతూ, విద్యార్థుల విద్యకై తమ వంతుగా ఈ కార్యక్రమం చేశామన్నారు. తమ కుమారుడు అయాన్ సిద్ధార్థ్ ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడంతో పాటు తోటి విద్యార్థుల మధ్య పుట్టిన రోజు జరపడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. అనంతరం ఎంఈఓ లక్ష్మణ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించే కార్యక్రమాన్ని చేపట్టినందుకు నరేందర్ ను అభినందించారు. అంతరం వారిని శాలువతో సత్కరించి అభినందలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణ, ఉపాధ్యాయురాలు కవిత, నాగర్ గూడ మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్, విలేజ్ సెక్రటరీ అజీమ్ వెంకటేష్, ముక్తార్ విటల్ గౌడ్ మహమ్మద్ ఆబేద్ సలీం మనీషా, తదితరులు పాల్గొన్నారు.




# సుంకిశాల రోడ్డులో ఏర్పడిన గుంతను పూడ్చాలి
### సిపిఎం డిమాండ్

**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** వలిగొండ మండల కేంద్రంలో సుంకిశాల రోడ్డులో ఏర్పడిన గుంతను పూడ్చాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర శ్రీనివాస్ లు డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున మండల కేంద్రంలోని సుంకిశాల రోడ్డులో కమాన్ వద్ద ఏర్పడిన గుంత వల్ల అనేకమంది ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న పట్టించుకోని అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు నెల రోజులుగా గుంత ఏర్పడి ఆ రోడ్డు మార్గం ద్వారా ప్రయాణం చేసే పట్టణ కేంద్రానికి చెందిన ప్రయాణికులతో పాటు, సుంకిశాల,పులిగిల్ల గ్రామాలకు చెందిన ప్రయాణికులతో పాటు ఇతర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఈ రోడ్డు మార్గం ద్వారా వలిగొండ నుండి కాటేపల్లి వరకు కొనసాగుతున్న డబుల్ రోడ్డు నిర్మాణం కోసం వెళ్లే అనేక మట్టి కంకర టిప్పర్లతోపాటు సుంకిశాల గ్యాస్ కంపెనీకి చెందిన వాహనాలు నిరంతరం ప్రయాణించడం జరుగుతుందని అధికారులు ఈ రోడ్డు మార్గం ద్వారా రోడ్డు పనులను పర్యవేక్షించేందుకు నిరంతరం ప్రయాణం చేస్తున్న ఏమాత్రం పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని వెంటనే ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని డిమాండ్ చేశారు ఈ గుంతలో అనేకమంది ద్విచక్ర ప్రయాణికులు ఇప్పటికే పడిపోయారని ఎవ్వరికి ఎలాంటి ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, మండల కమిటీ సభ్యులు కొండే కిష్టయ్య, ఉద్యమకారుల సంఘం జిల్లా నాయకులు బత్తిని రవీందర్, సిపిఎం పట్టణ నాయకులు కొండూరు సత్తయ్య,శీలం ఇందిర,వేముల లక్ష్మయ్య , ధ్యానబోయిన యాదగిరి, ఆలకుంట్ల నరసింహ,కొమ్ము స్వామి, రేగు ఇస్తారి,మైసొల్ల నరేందర్,చేగురి రాములు,అండాలు,ఈదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిజమా...! నీ దారెటు?



## బజారున పడుతున్న నాలుగో స్తంభం ప్రతిష్ట

- జర్నలిస్టు కావాలి అనుకునే వారికి కనీస విద్యార్హత లేకపోవడం బాధాకరం
- నిరక్షరాస్యులైనా, వ్రేలి ముద్ర పరిజ్ఞానమైనా టార్గెట్లు పూర్తి చేస్తే చాలు
- ప్రజల్లో జర్నలిజం అంటేనే నవ్వుల పాలవుతున్న వైనం
- కనీస విద్యార్హత నిర్దేశించి వారికే అక్రిడిటేషన్లు మంజూరు చేసేలా జీవో జారీ చేయాలి

**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్ :** సమాజాభివృద్ధికి బాటలు వేసే మీడియా విలువలు రాను రాను మరింత దిగజారిపోతున్నాయి. గౌరవప్రదమైన వృత్తిగా, సమాజాన్ని ప్రభావితం చేసే జర్నలిజం దారెటు అనేది అర్థం కావడం లేదు. జర్నలిస్ట్ కావాలి అనుకునే వారికి కనీస విద్యార్హత నిర్దేశించకపోవడం, టార్గెట్లు పూర్తి చేస్తే సక్సెస్ ఫుల్ జర్నలిస్ట్ గా యాజమాన్యాలు రెడ్ కార్పెట్ వేయటం సమాజానికి మూల స్తంభంగా పిలువబడే మీడియా పరువు ప్రజల్లో నవ్వుల పాలవుతోంది. సమాజాభివృద్ధిలో ప్రధానంగా నాలుగు స్తంభాలను నిర్ణయించారు. మొదటిది శాసనమండలి, రెండవది కార్యనిర్వహక, మూడవది న్యాయవ్యవస్థ, నాలుగవది మీడియా గా పేర్కొనడం జరిగింది. సమాజానికి మూల స్తంభం (ఫోర్త్ ఎస్టేట్) అని కూడా మీడియాను అభివర్ణిస్తారు. మొదటి మూడు వ్యవస్థలు సక్రమంగా పనిచేయకపోయినప్పటికీ వాటిని సక్రమమైన మార్గంలో నడిపించే వ్యవస్థగా మీడియాను మూలస్తంభంగా అభివర్ణించారు. అంతటి ప్రాధాన్యత ఉన్న మీడియా వ్యవస్థ జర్నలిజం నేడు ప్రక్క దారి పడుతోంది. పట్టింది. మూల స్తంభం పటిష్టంగా ఉండి మిగిలిన వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన బాధ్యత కలిగిన నాలుగో స్తంభం కునారిల్లుతోంది. దీనికి అనేక కారణాలు లేకపోలేదు. ప్రధానంగా జర్నలిస్టు కావాలి అనుకునే వారికి ఒక విద్యార్హత లేకపోవడం ఒక కారణమైతే, రాజకీయం అనే చట్రం క్రింద మీడియా స్వేచ్ఛ బందీ కావటం మరో కారణం. పోలీస్ రికార్డుల్లో కేసులు నమోదయి ఉన్నవారిని సైతం జర్నలిస్టుగా పలు యాజమాన్యాలు ఉద్యోగాలు ఇవ్వటం ఫలితంగా మీడియా పరువు బజారున పడటం ఇది ఒక కారణంగా చెప్పవచ్చు.

### నేను జర్నలిస్ట్ కావాలి విద్యార్హత ఏమిటి?

ఇక ఎవరైనా వచ్చి నేను జర్నలిస్టు కావాలి. విద్యార్హత ఏమిటి అని అడిగితే సమాధానం దొరకదు. ఎందుకంటే జర్నలిస్టు కావాలి అనుకునే వారికి ప్రభుత్వం కానీ, మీడియా యాజమాన్యాలు కానీ కనీస విద్యార్హతను ఇంతవరకు నిర్దేశించలేదు. దీని వలన ఓనమాలు రాని వారికి, టెన్త్ ఫెయిల్ అయిన వారికి సైతం పలు మీడియా యాజమాన్యాలు అందిన కాడికి పుచ్చుకొని ఐడి కార్డులు ఇచ్చేసి సమాజం మీదకు పంపుతున్నాయి. ఇదే అదునుగా చేసుకుని వార్త అంటే తెలియని వారు, అక్షరం ముక్క రాయటం రానివారు సామాజిక స్పృహ మచ్చుకైనా లేని వారు సైతం బెదిరించటం, ఎజెండాగా చేసుకుని జర్నలిస్టుగా రాణిస్తున్నారు. జర్నలిజం పరువును బజారున పడేస్తున్నారు. ఇప్పటికే పడేశారు. గౌరవమైన వృత్తిగా సమాజానికి మూలస్తంభంగా పిలువబడే మీడియా వీరి అరాచకాలు దాటికి కృంగిపోతోంది. బయటకు వెళ్తే చాలు జేబులో ఉన్న ఐడీ కార్డు చూపించి, సామాన్యులు మొదలుకొని వ్యాపారుల వరకు బెదిరించటం, స్వీయ లబ్ది పొందటం పరమావధిగా మారుతుంది. ఇదంతా యాజమాన్యాలకు తెలియదా అంటే పొరపాటే. వారు అడిగినటువంటి సంవత్సరం చందాలు, ప్రకటనలు చేస్తే మీ ఇష్టం అన్న చందంగా స్వేచ్ఛ ను ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది. పత్రికా స్వేచ్ఛ స్థానంలో బెదిరించే స్వేచ్ఛ చేరిందని చెప్పటంలో ఏ సందేహం లేదు. అడిగినన్ని డబ్బులు చెల్లిస్తే సన్మానాలు చేసి మరి కేసులు ఉన్నవారి కి సైతం రిపోర్టర్ గా ఐడి కార్డు , అక్రిడిటేషన్ సైతం ఇచ్చేస్తూ, స్వలాభాన్ని పొందుతున్నారు. దీనిని క్యాష్ చేసుకుంటూ మాంసం, చేపల మార్కెట్లు, ఇతర స్టాల్స్, రేషన్ మిల్లులు, నూనె దుకాణాలు వద్ద ఆయా కార్డులు చూపుతూ, బెదిరింపులకు తెరలేపుతున్న దుస్థితి నెలకొంది. అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చి వార్తలు ప్రచురించి వాటి పరిష్కారానికి మార్గం చూపితే ఎవరూ కాదనరు. కానీ ఐడీ కార్డు చూపి బ్లాక్ మెయిలింగ్ కు దిగటం వృత్తిని నవ్వుల పాలు చేయడంతో పాటు మిగిలిన జర్నలిస్టులకు కూడా ఆ మరకలను అంటించిన వారవుతున్నారు. దీనిని చూసి జర్నలిస్టులు అందరూ ఇంతే ఉంటారు అనుకుంటా అంటూ సామాన్యులు ముక్కున వేలేసుకునే పరిస్థితి కనిపిస్తోంది. దీని ప్రభావం మిగిలిన జర్నలిస్టులపై కూడా పడటం నిజంగా బాధాకరం.

### కనీస విద్యార్హత ఉంటేనే అక్రిడిటేషన్.. ఈ నిబంధన తెస్తేనే కొంతైనా మార్పు!

స్లీపర్ ఉద్యోగానికి సైతం ఏడవ తరగతి లేదా పదో తరగతి విద్యార్హతను నిర్దేశిస్తున్నారు. కానీ పవిత్రమైన వృత్తిగా భావించే సమాజాన్ని ప్రభావితం చేస్తూ, అనేక సమస్యల పరిష్కారానికి నాంది పలికే జర్నలిస్టు ఉద్యోగానికి విద్యార్హత నిర్దేశించలేదు. ఇకనైనా ప్రభుత్వాలు దృష్టి సారించాలి. నారా లోకేష్ విద్యా శాఖ మంత్రిగా ఉంటూ, ఈ శాఖలో అనేక విప్లవాత్మక మార్పులు సమూలంగా తీసుకువస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఇదే కోణంలో మండల స్థాయి విలేఖరికి కనీస విద్యార్హత ఇంటర్మీడియట్, జిల్లా స్థాయి విలేఖరికి డిగ్రీ నిర్దేశిస్తూ జీవో తీసుకురావాలి. అలా విద్యార్హత ఉంటేనే అక్రిడిటేషన్ ఇచ్చేలా నిబంధన రూపొందించాలి. ఈ నిబంధన పాటించకుండా కనీస విద్యార్హతలు లేని వారికి ఐడి కార్డ్ జారీ చేసే మీడియా సంస్థలపై చర్యలు తీసుకోవాలి. దీనివలన సమాజంలో జర్నలిజానికి విలువ పెరగటంతో పాటు స్క్రాప్ బ్యాచ్ కొంతైనా తగ్గే అవకాశం ఉంటుంది.




## కాచం కృష్ణమూర్తి స్ఫూర్తితో
# భూ పోరాటాలకు సిద్ధం కావాలి
### సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్

**భువనగిరి రాజముద్ర న్యూస్ :** భూమికోసం, భుక్తి కోసం, పీడిత తాడిత ప్రజల విముక్తి కోసం రాచరిక వ్యవస్థకు, ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా బక్క చిక్కిన పేదలను ఒక్కటి చేసి వారి చేత బంధుకూలు పట్టించి సాయుధ రైతాంగ పోరాటంలో ముందు నడిచిన పోరాట యోధుడు, వందలాది ఎకరాల భూములను పేదలకు పంచిన భూ పోరాటాల దిక్సూచి కామ్రేడ్ కాచం కృష్ణమూర్తి 19వ వర్ధంతి స్ఫూర్తితో పేదలు, వ్యవసాయ కూలీలు మరోసారి భూ పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి. జహంగీర్ పిలుపునిచ్చినారు. శుక్రవారం రోజున సుందరయ్య భవన్, భువనగిరిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కామ్రేడ్ కాచం కృష్ణమూర్తి 19వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించడం జరిగింది. అనంతరం " భూ భారతి – భూ సమస్యలను పరిష్కరిస్తుందా " అనే అంశంపై చర్చా వేదిక కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి అధ్యక్షతన నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జహంగీర్ పాల్గొని మాట్లాడుతూ ఆనాడు వెట్టి చాకిరికి, దోపిడికి, బానిస విధానానికి ఆత్మగౌరవ పోరాటాలు, భూమి బుక్తి విముక్తి పోరాటాలు నిర్వహిస్తే ప్రజలు నేటి వరకు స్వేచ్ఛగా జీవిస్తున్న పరిస్థితి ఉన్నదని అన్నారు. కానీ దేశంలో అధికారంలో చేపట్టిన బిజెపి గత పది సంవత్సరాల్లో అనేక చట్టాలను మారుస్తూ ప్రజల హక్కులను కాలరాస్తూ రాజ్యాంగ స్ఫూర్తినే దెబ్బతీయాలనే కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. భారత దేశాన్ని దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు పరం చేసి పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కూడా పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో దళారుల రక్షణ కోసం, కార్పొరేట్ శక్తులకు, భూస్వాములకు తిరిగి భూములను అప్పజెప్పడానికి ధరణి అనే చట్టాన్ని తెచ్చి రైతులను, పేదలను ఇబ్బందుల పాలు చేశారని విమర్శించారు. ధరణి చట్టం వల్ల అనేకమంది పేదలు నూతన పాసుబుక్కులు రాక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కూడా దూరమయ్యారని ఆవేదన వెలిబుచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టంలో ఉన్న కొన్ని లోపాలను సరిచేసి చట్టాన్ని అమలు చేసి రాష్ట్రవ్యాప్తంగా, జిల్లా వ్యాప్తంగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు వెంటనే పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధం కూడా ఎత్తివేయాలని అన్నారు. ఎక్కడైతే ప్రభుత్వ భూములు ఉన్నాయో ఆ భూములన్నిటిని సర్వే చేసి ఇండ్ల స్థలాలు లేని పేదలందరికీ 120 గజాల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలని, రెండు ఎకరాలు చొప్పున సాగు భూమి ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. నాడు కృష్ణమూర్తి కూలీల, రైతుల కార్మికుల సమస్యలపై పోరాడి అన్ని వర్గాల ప్రజా నాయకుడిగా ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారని వారి స్ఫూర్తిని కొనసాగించడానికి ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని వారు సూచించారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాచకొండ జనార్ధన్, బీఎస్పీ రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్యలు మాట్లాడుతూ దళారుల రక్షణ కోసం తెచ్చిన ధరణి చట్టాన్ని రద్దుచేసి భూ భారతి చట్టాన్ని తేవడాన్ని స్వాగతిస్తున్నామని కానీ గత ప్రభుత్వం అనుసరించిన విధంగా ఈ ప్రభుత్వము తమ విధానాలను అమలు చేయొద్దని సూచించారు. ఇప్పటికైనా జిల్లా వ్యాప్తంగా భూమి లేని పేదలను గుర్తించి వారందరికీ ప్రభుత్వ భూములను పంచాలని అన్నారు. ప్రజల చేతికి భూమి వస్తేనే దరిద్రం పోతుందని, నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందని, ప్రజల జీవన విధానంలో మార్పు వస్తుందని వారు తెలియజేసారు. దేశంలో నరరూప రాక్షసుడైన మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 500 ఆదివాసి గూడాల్లో ఐదు లక్షల ఎకరాల పైగా భూమి రక్షణ కోసం ఉద్యమాలు జరుగుతున్నాయని అన్నారు. ఆనాడు కామ్రేడ్ కృష్ణమూర్తి లాంటి వాళ్లు అనేకమంది ప్రజల పక్షాన పోరాడి హక్కులను చట్టాలను సాధించుకున్నారని అన్నారు. ఈనాటి పాలకులు ఆ చట్టాలను, హక్కులను కాలరాయడానికి కపట నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకం రైతులు, కూలీలు, కార్మికులు, ప్రజలు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా, సిఐటియు జిల్లా అధ్యక్షులు దాసరి పాండు, ఐలు జిల్లా అధ్యక్షులు బొల్లెపల్లి కుమార్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బర్రె సుదర్శన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, జిఎంపిఎస్ జిల్లా కార్యదర్శి దయ్యాల నర్సింహ, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కళ్లెపు అడవయ్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు, తిరందాసు గోపి విజ్ఞాన కేంద్రం ట్రస్టు అధ్యక్షులు గద్దె నర్సింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జూకంటి పౌలు, జిల్లా సహాయ కార్యదర్శి సిరిపంగి స్వామి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్ , ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వీర్లపల్లి ముత్యాలు, సిపిఎం భువనగిరి పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ , రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి వడ్డేబోయిన వెంకటేష్ , ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి వనం రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు సిలువేరు ఎల్లయ్య , కొండపురం యాదగిరి, నాయకులు కొండపురం పౌల్, మూడుగుల బాలరాజు, ఉప్పలయ్య , బందారి ప్రభాకర్, రాంబాబు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## లచ్చమ్మ మృతదేహానికి నివాళులర్పించిన
# మాజీ ఎంఎల్ఏ పైల్ల శేఖర్ రెడ్డి

**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లోని కంచనపల్లి గ్రామానికి చెందిన కారొబార్ వడ్డేబోయిన వెంకటేశం యొక్కతల్లి లచ్చమ్మ గురువారం రోజున మరణించడం జరిగింది. ఆమె మృతదేహానికి భువనగిరి నియోజక వర్గ మాజీ ఎంఎల్ఏ పైల్ల శేఖర్ రెడ్డి హాజరై వారి పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ వలిగొండ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షులు దేగల పాండరీ వడ్లకొండ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగుల పట్ల వేధింపులకు
# పాల్పడితే కఠిన చర్యలు : ఎస్పి నరసింహ



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** పని ప్రదేశంలో,ఉద్యోగం చేసే చోట మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ నరసింహ ఐపిఎస్ హెచ్చరించారు. పని చేసే చోట మహిళలకు భద్రత,భరోసా కల్పించడం అందరి బాధ్యత, మహిళలను గౌరవించడం మన సంప్రదాయం,వారి ఎదుగుదలగు తోడ్పాటు ఇవ్వాలి, మహిళా సాధికారిత సమాజానికి మంచిది అని ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపినారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. కాలం, సమయం లెక్కచేయక పని చేస్తున్నారు అన్నారు. కుటుంబాన్ని పిల్లలను సరిదిద్దవంలో తల్లిగా మహిళా తన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తున్నది,అలాంటి మహిళా సమాజంలో ఏదోరకంగా వేధింపులకు గురవుతూనే ఉన్నది అన్నారు. పోలీసు శాఖ మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నది అన్నారు. ప్రభుత్వ, ప్రవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు,బ్యాంక్ లు, మార్కెట్ లు,ప్రభుత్వ ప్రవేటు సంస్థలు,ఫ్యాక్టరీలు,కూలీ ప్రదేశాలు ఇలా ఎక్కడైనా మహిళా పని చేసేచోట మహిళలను వేధించిన, ఇబ్బందులకు గురి చేసిన, అపహస్యం చేసినా, కించపరిచినా చట్టపరంగా చర్యలు ఉంటాయి అన్నారు. వేధింపులకు సంభందించి డయల్ 100 కు, జిల్లా షిటీమ్ పోలీస్ 8712686056 నంబర్ కు ఫిర్యాదు చేయాలి అన్నారు.



# అక్రమ మైనింగ్‌పై జిల్లా టాస్క్ ఫోర్స్ కొరడా
### ఐదు ట్రాక్టర్లు, రెండు జేసీబీలు సీజ్ : జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పరిధిలోని పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాల్ సింగ్ తండా శివారులో అక్రమ ఎర్ర రాయి తవ్వకాలపై జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు ఈ రోజు మెరుపు దాడి చేసి అక్రమంగా తవ్విన ఎర్ర రాయిని కర్ణాటక రాష్ట్రానికి తరలించడానికి సిద్ధంగా ఉన్న ఐదు ట్రాక్టర్లు, తవ్వకాలకు ఉపయోగిస్తున్న రెండు జేసీబీలను జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకొని సీజ్ చేసి, వారిపై పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగింది అని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక, రాతి, మట్టి, ఇతర ఖనిజాలను అక్రమంగా తవ్వడం, తరలించడం తీవ్రమైన నేరమని హెచ్చరించారు. అటువంటి కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపినారు.



# ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామా

## సెప్టెంబర్ 9న కొత్త ఉప రాష్ట్రపతి ఎన్నిక

**న్యూఢిల్లీ:** నూతన ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం శుక్రవారం షెడ్యూల్ విడుదలైంది. సెప్టెంబర్ 9న ఆ ఎన్నిక జరగనుందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఈ ప్రక్రియ అనివార్యమైంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ధన్‌ఖడ్ తన పదవిని వీడారు. ఆరోగ్యపరమైన కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ పంపారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ల 344 రోజులకే వైదొలిగారు. 74 ఏళ్ల ధన్‌ఖడ్ తర్వాత ఉప రాష్ట్రపతిగా ఎవరిని ఎన్నుకుంటారనే అంశంపై ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. దీనిపై ఆగస్టు 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయనుంది. నామినేషన్ల దాఖలుకు చివరితేదీ ఆగస్టు 21గా ప్రకటించింది. పోలింగ్ తేదీ నాడే అంటే సెప్టెంబర్ 9నే ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఉప రాష్ట్రపతి పదవికి ఎన్డీయే కూటమి.. ఎవరిని ఎంపిక చేస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రేసులో పలువురి పేర్లు తెర పైకి వచ్చాయి. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్, జేడీయూ నేత హరివంశ్ నారాయణ్ సింగ్, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సహా పలువురు నేతల పేర్లు ఉప రాష్ట్రపతి రేసులో ఉన్న సంగతి తెలిసిందే. పార్టీ సిద్ధాంతాలు, భావజాలానికి అనుగుణంగా వ్యవహరించే నేతకు భాజపా ఆ పదవిని అప్పగిస్తుందని సమాచారం. ఉభయ సభల్లో వివిధ ఖాళీలతో కలిపి సభ్యుల సంఖ్య ప్రస్తుతం 786గా ఉంది. ఇందులో మెజారిటీకి 394 మంది మద్దతు అవసరం. లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలముంది. రాజ్యసభలో 129 మంది మద్దతుంది. మరోవైపు విపక్ష కూటమికి లోక్‌సభలో 234 మంది సభ్యులు, రాజ్యసభలో 79 మంది సభ్యుల బలముంది. మొత్తంగా ఎన్డీయేకు 422 మంది, విపక్ష కూటమికి 313 మంది అనుకూలంగా ఉన్నారు. ఇలా ఉభయ సభల్లో మెజారిటీ లేనప్పటికీ ఉప రాష్ట్రపతి ఎన్నికలో పోటీ చేసేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

### ఆర్ఎస్ఎస్ చీఫ్‌ను అరెస్టు చేయాలని

# అప్పట్లో ఆదేశాలు వచ్చాయి

## మాజీ పోలీసు అధికారి



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో నిందితులందరినీ ముంబయిలోని ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నాటి కేసు విచారణ బృందంలో ఉన్న మాజీ ఏటీఎస్ అధికారి మహబూబ్ ముజావ్ మాట్లాడుతూ కీలక ఆరోపణలు చేశారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను అరెస్టు చేయాలని అప్పట్లో తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. శుక్రవారం ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు దర్యాప్తునకు సంబంధించి కొంతమంది వ్యక్తులను అరెస్టు చేయాలని తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. వారిలో రామ్ కల్సంగ్రా, సందీప్ దాంగే, దిలీప్ పాటిదార్‌తో పాటు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ కూడా ఉన్నారన్నారు. అలాంటి ప్రభావం చూపే వ్యక్తిని అరెస్టు చేయడం అంటే అది తన శక్తికి మించిందన్నారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న పరమ్‌బీర్ సింగ్‌తో పాటు మరికొంతమంది ఉన్నతాధికారులు ఈ ఆదేశాలను తనకు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. వారి సూచనల ప్రకారం.. తనకు సాయం చేసేందుకు రాష్ట్రం నుంచి దాదాపు పది మంది సిబ్బందిని సమకూర్చారన్నారు. నిధులు సమకూ ర్చడంతో పాటు అధికారికంగా రివాల్వర్ కూడా జారీ చేశారని ముజావ్ తెలిపారు. అయితే, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించేందుకు నిరాకరిం చడంతో తనపై తప్పుడు కేసు పెట్టారన్నారు. ఆ తర్వాత వాటన్నింటిలో తాను నిర్దోషిగా బయటకు వచ్చినట్లు వెల్లడించారు. మహారాష్ట్రలోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబరు 29న పేలుడు సంభవించింది. ఓ మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబు పేలడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికి పైగా గాయపడ్డారు. అప్పట్లో ఈ కేసు పెను సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై ప్రజ్ఞా ఠాకూర్, పురో హిత్‌తో పాటు రమేశ్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్‌కార్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణిలను ప్రధాన నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదైంది. ఈ కేసుపై ముంబయిలోని ప్రత్యేక కోర్టులో గురువారం విచారణ జరగ్గా.. నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటించింది.

### హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు, దరఖాస్తుల ఆహ్వానం



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, బేగంపేట్ 1 వ తరగతి ప్రవేశం కోసం అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు దరఖాస్తు చేసుకో వాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు వికారాబాద్ జిల్లాకు చెందిన వారై ఉండాలని, ఒక కుటుంబంలో ఒక విద్యార్థికి కి మాత్రమే ప్రవేశం కల్పించడం జరుగుతుందని తెలియజేశారు. గ్రామీణ షెడ్యూల్డ్ కులాల వారి వార్షిక ఆదాయం 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం 2 లక్షలకు మించకుండా ఉండాలని అన్నారు. విద్యార్థిని విద్యార్దులు 01. 6.2018 నుండి 31. 05.2019 మధ్యన జన్మించి న వారు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. ధరఖాస్తూ ఫారాలు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం రూమ్ నెంబర్ 10 కలెక్ట రేట్ కార్యాలయంలో వికారాబాద్ పొందగలరు. పూర్తి చేయబడిన నిర్ణీత దర కాస్తు పారంను సంబంధిత ధ్రువపత్రములతో 08.08.2025 సమర్పించా లన్నారు. వివరాలకు 9573859268 నెంబర్ ను సంప్రదించాలని తెలిపారు.

### వసతి గృహాలలో ఆదర్శ పాఠశాలల్లో

# మరమ్మతులను వేగవంతం చేయాలి

## వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వసతి గృహాల్లో, ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న మరమత్తు పనులను వేగవంతం చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం నవాబుపేట్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, ఆదర్శ పాఠశాల, బీ.సీ.వసతి గృహం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీ.సీ. వసతి గృహం పనులను పూర్తి చేసి ఆగస్టు 15 లోపు అన్ని వసతులతో అందుబాటులోకి తీసుకురావాలని అధికారుల సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడంతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని తప్పనిసరిగా అందించాలని కలెక్టర్ తెలిపారు. వసతి గృహాల్లోని విద్యార్థిని విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ వైద్య సేవలు అందించాలని కలెక్టర్ తెలిపారు.



కేజీబీవీ పాఠశాలలోని తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థినిలతో మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు ఇంగ్లీషులోనే మాట్లాడుకోవాలని, అప్పుడే ఇంగ్లీషును అనర్గళంగా మాట్లాడే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభిప్రాయాలను, కావలసిన సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థినీలకు నోటు పుస్తకాలను కలెక్టర్ అంద జేశారు. మండలంలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిర్మాణాలు చేపట్టుకుంటున్న లబ్ధిదారులకు చెల్లింపుల్లో ఏదైనా సాంకేతిక లోపం ఉంటే తన దృష్టికి తీసుకు వచ్చినట్లయితే సమస్యలు పరిష్కరి స్తానని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల ని ర్మాణ చేపట్టుకుంటున్న తీరును పరిశీలించి లబ్ధిదారుతో కలె క్టర్ మాట్లాడారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీలో తహసీల్దార్ బుచ్చ య్య, ఎంపీడీఓ అనురాధ, ప్రిన్సిపాల్ లు డాక్టర్ కృష్ణకుమార్, శ్రీలత, పంచాయతీ కార్యదర్శి నవనీత లు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో రమ్మీ ఆడిన మంత్రికి క్రీడల శాఖ

## మహారాష్ట్ర ప్రభుత్వం షాకింగ్ నిర్ణయం



**ముంబయి:** అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా సభలో కూర్చొని రమ్మీ ఆడారంటూ మహారాష్ట్ర మంత్రి మాణిక్ రావ్ కోకాటేపై వచ్చిన ఆరోపణలు తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఆయన మంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ క్రమంలోనే తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చర్చనీయాంశమైంది. మాణిక్ రావ్‌పై వేటు వేయలేదు కానీ.. ఆయనకు క్రీడల శాఖను అప్పగించడం విమర్శలకు దారితీసింది. మహారాష్ట్రలో మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణకు సంబంధించి గురువారం అర్ధరాత్రి ఓ ప్రకటన వెలువడింది. ఇప్పటివరకు మాణిక్ రావ్ కోకాటే వ్యవసాయశాఖ మంత్రిగా ఉండగా.. తాజాగా ఆ బాధ్యతలను ఎన్సీపీ మంత్రి దత్తాత్రేయ భరణెకు అప్పగించారు. కోకాటేకు క్రీడలు, యువజన సంక్షేమ మంత్రిత్వశాఖను కేటాయించారు. గతంలో ఈ శాఖను దత్తాత్రేయ పర్యవేక్షించారు. వివాదాస్పదమైన చర్యలకు పాల్పడే మంత్రులపై తీవ్ర పరిణామాలు తప్పవనే సంకేతాలిచ్చేందుకే ఈ మంత్రివర్గ మార్పు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అయితే, అసెంబ్లీలో రమ్మీ ఆడిన మంత్రిని పదవి నుంచి తొలగించకుండా కేవలం శాఖను మార్చడం ఇప్పుడు వివాదాస్పదమైంది. "ఇది జవాబుదారీతనం అనిపించుకోదు. కేవలం కంటితుడుపు చర్య మాత్రమే" అని ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) నేతలు మండిపడుతున్నారు. ఆయనకు క్రీడల శాఖను అప్పగించడం అంటే.. అసెంబ్లీలో రమ్మీ ఆడటాన్ని అధికారికంగా అనుమతించినట్లే అవుతుందని దుయ్యబట్టారు. ఇటీవల ఎన్సీపీ (శరద్‌పవార్ వర్గం) ఎమ్మెల్యే రోహిత్ పవార్ తన 'ఎక్స్' ఖాతాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. అందులో మాణిక్‌రావ్ అసెంబ్లీ సమావేశాల్లో కూర్చొని ఫోన్లో రమ్మీ ఆడుతున్నట్లుగా ఉంది. ఇదికాస్తా వైరల్‌గా మారింది. రైతులు, వ్యవసాయ సమస్యల గురించి సభలో చర్చలు జరుగుతున్న సమయంలో రాష్ట్ర మంత్రి ఇలా వ్యవహరించారని విపక్షాలు మండిపడ్డాయి. దీనిపై మాణిక్‌రావ్ స్పందిస్తూ.. తనకు రమ్మీ ఆడటమే రాదన్నారు. ఈ ఆరోపణలపై తాను దోషిగా తేలితేనే రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు.


# అమ్ముడుపోయిన టౌన్ ప్లానింగ్ అధికారులు..?

- ఫిర్యాదులు బుట్ట దాఖలేనా..!
- అనుమతి ఒక ఫ్లోర్... వేసింది ఐదు ఫ్లోర్లు..!
- అనుకోని ఘటనలు జరిగితే ఎవరిది బాధ్యత..?
- రాజకీయ నాయకుల ఒత్తిడికి అధికారులు జంకుతున్నారా..?



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :** మహానగరంలో అక్రమ నిర్మాణాలకు అంతులేకుండా పోయింది. ఒకవైపు నగరం రోజురోజుకీ నూతన పరిజ్ఞానం వైపు పరిగెడుతుంటే మరొకవైపు అక్రమ నిర్మాణాల వైపు పరిగెడుతుంది. కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలోని ఫతేనగర్ లో అక్రమ నిర్మాణాల జోరు అంతా ఇంతా లేదు. డివిజన్లోని కొన్ని ప్రదేశాలలో ఆటో వెళ్లడానికి కూడా రోడ్డు సరిపోనటువంటి వీధుల్లో కూడా నాలుగు నుంచి ఆరు అంతస్థులు అక్రమంగా నిర్మిస్తున్నారు నిర్మాణదారులు. కొందరు స్థానికులు జరుగుతున్న అక్రమాలను ఆపడానికి స్థానికంగా మూసాపేట పరిధిలో ఉన్న మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగానికి గత కొన్ని కాలాలుగా ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునే నాధుడే లేడంటూ.. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులన్నీ ఏమాత్రం కనికరం లేకుండా కనీసం మా ఫిర్యాదును ఒకసారి కూడా చూడకుండా సీదా బుట్ట దాఖలు చేస్తున్నారని వాపోతున్నారు. ఇచ్చిన ఫిర్యాదులను లెక్కచేయకుండా ఇదిగో వస్తున్నాం అదిగో చూస్తున్నాం అంటూ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు స్థానికులకు సమాధానాలు ఇస్తూ ఉన్న పనిని సాగదీస్తూ పోతా ఉంటే.. అధికారులు అందరూ అమ్ముడు పోయారేమో అని అనుకుంటున్నారు. ఇదే ఫతేనగర్ లో ఒక నిర్మాణదారుడు ఒక నాలుగు సంవత్సరాల కింద కేవలం ఒక అంతస్తు నిర్మించి ఏమాత్రం అనుమతులు లేకుండా స్థానిక నాయకుల సహకారంతో ఏకంగా ఐదంతస్తులు నిర్మించి ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కూలీలకి కిరాయి ఉండడానికని ఇచ్చినట్లు సమాచారం. కానీ ఆ నిర్మాణం పాతది అయినందున.. జరగరానిది ఏమైనా జరిగి ఉన్న నాలుగు అంతస్తులలో ఉంటున్న కూలీల జీవితాలకు ఏమైనా అయితే.. అప్పుడు లంచాలు తీసుకుని ఆ నిర్మాణాన్ని ఏమీ అనకుండా ఉన్నా అధికారులు ముందుకు వస్తారా..! లేకపోతే ఆ నిర్మాణానికి సపోర్టుగా నిలుస్తున్న నాయకులు ముందుకు వచ్చి వారి జీవితాలను కాపాడుతారా..? అని స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకొని, ఆ నిర్మాణదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# డిఎంహెచ్‌ఓ ఆదేశానుసారం డ్రై డే కార్యక్రమం



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే లలితా దేవి ఆదేశానుసారం ప్రతి శుక్రవారం జరిగే డ్రై డే కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ఐ డి ఓ సి కార్యాలయ ఆవరణలో నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి నీటిని తొలగించడం జరిగినది. ఐ డి ఓ సి కాంప్లెక్స్ మధ్యలో ఉన్న ఫౌంటెన్ లో టీమోపాస్ రసాయనాన్ని చల్లి లార్వా నివారణ చర్యలు తీసుకోవడం జరిగినది. గార్డెన్ లోనీ పూల మొక్కలు, గడ్డి ప్రాంతాలలో దోమలు ఉండకుండా రసాయనాలను చల్లడం జరిగినది. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో లార్వా నివారణ చర్యలు తీసుకోవడం జరిగినది. ఐ డి ఓ సి కార్యాలయంలోనీ అన్ని బాత్రూములు, హాళ్లు, క్యారీ డార్ లలో దోమల నివారణకు ఆల్ఫా సైప్రో మిత్రాన్ రసాయనాన్ని స్ప్రే చేయడం జరిగినది. కార్యాలయంపై భాగంలో ఉన్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం జరిగినది. శనివారం సాయంత్రం ఐడిఓసి కార్యాలయ ఆవరణలో దోమల నివారణకు ఫాగింగ్ చేయడం జరుగుతుందన్నారు. లార్వా, దోమల నివారణ కార్య క్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్వయంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రవీణ్ కుమార్, డిప్యూటీ డెమో వి శ్రీనివాసులు, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యం, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



### మరి మీరు రష్యాతో

# వ్యాపారం చేయొచ్చా

## అమెరికాపై విరుచుకుపడిన చైనా

**చైనా:** రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగించే దేశాలపై భారీగా సుంకాలు విధిస్తానంటూ అమెరికా పదేపదే హెచ్చరికలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ హెచ్చరికలపై తాజాగా మరోసారి చైనా స్పందించింది. వాస్తవానికి రష్యాతో అమెరికానే వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తుందని ఐక్యరాజ్యసమితిలోని బీజింగ్ డిప్యూటీ శాశ్వత ప్రతినిధి గెంగ్ షువాంగ్ పేర్కొన్నారు. అమెరికా హెచ్చరికలపై ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐరాస భద్రతా మండలిలో ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరాల అంశంపై చర్చ సమయంలో అమెరికా ప్రతినిధి చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. అనేక సందర్భాల్లో చెప్పినట్లే.. రష్యాకు ఎలాంటి ఆయుధాలను అందించలేదని స్పష్టం చేశారు. రష్యాతో పాటు ఉక్రెయిన్‌తో కూడా సాధారణ వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్నామన్నారు. అవి అంతర్జాతీయ చట్టాలకు లోబడే ఉన్నాయని, ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదన్నారు. వాస్తవానికి అమెరికానే ఇప్పటివరకు రష్యాతో వాణిజ్యం కొనసాగించిందని విమర్శించారు. ఇతరులు వాణిజ్య సంబంధాలు కొనసాగించకూడదు కానీ.. మీరు చేయొచ్చా అని ఈసందర్భంగా ఆయన యూఎస్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో సంక్షోభం కీలక దశలో ఉందని, దాని పరిష్కారానికి ఇది సరైన సమయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈసందర్భంగా ఇతరులపై నిందలు వేసి బలిపశువులను చేయడం మాని.. కాల్పుల విరమణ, కీవ్‌లో శాంతి నెలకొల్పడం అనే అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు. మాస్కోతో వాణిజ్య సంబంధాలు కొనసాగించడాన్ని అమెరికా తీవ్రంగా తప్పుబడుతుంది. దీని కారణంగా ఉక్రెయిన్‌తో యుద్ధం సాగించేందుకు రష్యాకు ఉపయోగపడుతుందని అభిప్రాయపడుతోంది. ఆ దేశం నుంచి ఇంధనం కొనుగోలు చేసే భారత్, చైనాలతో సహా ఇతర దేశాలపై పెద్దఎత్తున సుంకాలు విధిస్తానని పలుమార్లు హెచ్చరించింది. ఈక్రమంలో భారత్‌పై 25శాతం సుంకంతో పాటు జరిమానాలు కూడా విధించింది.



### కోటిపల్లి ప్రాజెక్టు

# కాలువలు మరమ్మతులు చేపట్టాలి

## స్పీకర్‌కు మెమొరండం ఇచ్చిన సిపిఎం జిల్లా బృందం

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పరిధిలోని సర్పంన్ పల్లి, కోటిపల్లి ప్రాజెక్టు ద్వారా రైతు పొలాలకు నీరు అందించే కాలువలు మరమ్మతులకు వచ్చాయని వెంటనే మరమ్మత్తులు చేపించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు వికారాబాద్ జిల్లా కేంద్రంలోన ఎమ్మెల్యేకు మెమొరండం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మైపాల్ మాట్లాడుతూ రైతుల పంట పొలాలకు ప్రాజెక్టు నీరు అందాలంటే ప్రాజెక్టు కాలువలను మరమ్మత్తులను చేపట్టాలన్నారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటది కాబట్టి రైతులకు పంట పొలాలకు ప్రాజెక్టు నీరు అందే విధంగా చూడాలన్నారు.

### బిహార్ ఓటరు ముసాయిదా

# జాబితా విడుదల చేసిన ఈసీ




**న్యూఢిల్లీ :** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న కేంద్ర ఎన్నికల సంఘం.. ఇటీవల రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ ప్రక్రియ అనంతరం ఓటరు ముసాయిదా జాబితాను ఈసీ శుక్రవారం విడుదల చేసింది. దీన్ని ప్రధాన రాజకీయ పార్టీలకు అందజేసింది. అయితే, ప్రస్తుతానికి ఈ ముసాయిదా జాబితాలో చేర్చిన వివరాలు ఇంకా వెబ్‌సైట్‌లో పూర్తిగా అందుబాటులోకి రాలేదు. కానీ, ఓటర్లు ఈసీ వెబ్‌సైట్‌లో తమ పేర్లను చెక్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాధారణ ఓటర్లు ఈ జాబితాను చూడొచ్చని ఈసీ తెలిపింది. ఈ జాబితాలో సవరణలకు నెల రోజుల (సెప్టెంబరు 1 వరకు) గడువు కల్పించారు. అర్హులైన వ్యక్తుల పేర్లను జాబితాలో చేర్చడానికి, అనర్హులుగా భావించినవారి పేర్లను తొలగించడానికి పౌరులు, రాజకీయ పార్టీలు ఈలోగా ప్రతిపాదనలు చేయొచ్చని అధికారులు స్పష్టంచేశారు. ముసాయిదా జాబితాను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో.. గుర్తింపు పొందిన పార్టీలకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సమగ్ర సవరణకు ముందు రాష్ట్రంలో 7.93 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ సవరణ చేపట్టగా.. కీలక విషయాలు బయటపడిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో 52 లక్షల మంది ఓటర్లు సంబంధిత చిరునామాల్లో లేరని వెల్లడైంది. 18 లక్షల మంది ఓటర్లు చనిపోగా, 26 లక్షల మంది ఇతర నియోజకవర్గాలకు మారినట్లు ఈసీ తెలిపింది. మరో ఏడు లక్షల మంది ఓటర్లు రెండుచోట్ల ఓటు నమోదు చేసుకున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. అయితే, ఈ సమగ్ర సవరణను కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ఓటర్లను తొలగిస్తున్నారని దుయ్యబట్టాయి. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం అత్యున్నత న్యాయస్థానం వద్ద పెండింగ్‌లో ఉంది.

# గొప్పగా పుంజుకున్న భారత్

- దెబ్బ కొట్టి.. దెబ్బ తిన్న ఇంగ్లాండ్
- 92/0 నుంచి.. 247 ఆలౌట్
- భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 224.. రెండో ఇన్నింగ్స్‌లో 75/2



**లండన్:** భారత్, ఇంగ్లాండ్ మధ్య సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే అయిదో టెస్టు రసవత్తరంగా సాగుతోంది. రెండో రోజు భారత్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులకే ఆలౌట్ చేసి, ధనాధన్ బ్యాటింగ్‌తో మ్యాచ్‌పై పట్టు బిగించేలా కనిపించిన ఇంగ్లాండ్.. మహ్మద్ సిరాజ్ (4/86), ప్రసిద్ధ్ కృష్ణ (4/62)ల ధాటికి 247 పరుగులకే ఆలౌటై, 23 పరుగుల స్వల్ప ఆధిక్యంతో సరిపెట్టుకుంది. క్రాలీ (64, 57 బంతుల్లో 14(4)), డకెట్ (43, 38 బంతుల్లో 5(4), 2(6)), బ్రూక్ (53, 64 బంతుల్లో 5(4), 1(6)) రాణించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్.. శుక్రవారం ఆట చివరికి 2 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (51 బ్యాటింగ్, 49 బంతుల్లో 7(4), 2(6)) విలువైన ఇన్నింగ్స్ ఆడుతున్నాడు. రాహుల్ (7), సుదర్శన్ (11) ఔటయ్యారు. జైస్వాల్‌కు తోడుగా ఆకాశ్‌దీప్ (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

### ఉదయం టపటపా.. సాయంత్రం ధనాధన్

శుక్రవారం ఉదయం 204/6తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్.. మిగతా 4 వికెట్లు కోల్పోవడానికి ఎంతో సమయం పట్టలేదు. ముందు రోజు పట్టుదలతో పోరాడిన కరుణ్ నాయర్ (ఓవర్ నైట్ 52), వాషింగ్టన్ సుందర్ (ఓవర్‌నైట్ 19).. ఉదయం ఎంతోసేపు నిలవకపోవడంతో భారత్ అనూహ్యంగా కుప్పకూలింది. కరుణ్ ఇంకో 5 పరుగులే చేసి టంగ్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరగగా.. సుందర్ ఓవర్‌నైట్ స్కోరుకు 7 పరుగులు జోడించి అట్కిన్సన్‌కు వికెట్ ఇచ్చేశాడు. సిరాజ్ (0), ప్రసిద్ధ్ (0)లను ఊద్చేయడానికి అట్కిన్సన్‌కు ఎంతో సమయం పట్టలేదు. కేవలం 6 పరుగుల వ్యవధిలో భారత్ నాలుగు వికెట్లు కోల్పోయింది. రెండో రోజు 5.4 ఓవర్లు మాత్రమే ఆడి 20 పరుగులే జోడించి ఇన్నింగ్స్‌ను ముగించింది భారత్. అట్కిన్సన్ 5 వికెట్ల ప్రదర్శన చేశాడు. అయితే సాయంత్రం రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటింగ్ భిన్నంగా సాగింది. జైస్వాల్ దూకుడైన ఆటతో ఇంగ్లిష్ బౌలింగ్‌ను తుత్తునియలు చేశాడు. ఆరంభం నుంచి బౌండరీల వేటలో దూసుకెళ్లిన అతను.. స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతడి ధాటికి భారత్ 12వ ఓవర్లోనే 50 దాటింది. అయితే అంతకంటే ముందు రాహుల్.. టంగ్ బౌలింగ్‌లో వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తర్వాత సుదర్శన్ సహకారంతో జైస్వాల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. కానీ ఆట చివర్లో సుదర్శన్.. అట్కిన్సన్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోవడంతో భారత్ కొంత అసంతృప్తితో ఆటను ముగించింది. ఆ వికెట్ పడకపోతే రెండో రోజు భారత్‌దే స్పష్టమైన పైచేయి అయ్యేది.

### ముందు బజ్‌బాల్.. ఆపై ధమాల్

రెండో రోజు ఉదయం భారత్‌ను త్వరగా ఆలౌట్ చేసిన ఉత్సాహంతో తొలి ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఇంగ్లాండ్.. బ్యాటుతో రెచ్చిపోయింది. సిరీస్‌లో నాలుగో టెస్టులో మినహా బాజ్‌బాల్ ఆట ఆడేందుకు పెద్దగా అవకాశం దక్కించుకోలేకపోయిన ఇంగ్లిష్ జట్టు.. శుక్రవారం మాత్రం ఆ శైలిలోనే ఆడింది. ఓపెనర్లు డకెట్, క్రాలీ వన్డే తరహాలో ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. రన్‌రేట్ 7-8 మధ్య సాగింది. డకెట్, క్రాలీ పోటాపోటీగా బౌండరీలు బాదారు. డకెట్ రెండు సిక్సర్లు కూడా బాదాడు. 12 ఓవర్లకే స్కోరు 92కు చేరుకుంది. ఓపెనర్లిద్దరూ అర్ధశతకాల ముంగిట నిలిచారు. ఈ ఊపు చూస్తే ఇంగ్లాండ్ 400-500 మధ్య స్కోరు చేస్తుందా, భారత్‌కు ఇన్నింగ్స్ ఓటమి తప్పదా అన్న ఆలోచనలు కలిగాయి. కానీ ఆకాశ్‌దీప్.. 13వ ఓవర్లో డకెట్‌ను ఔట్ చేసి భారత్‌కు కాస్త ఉపశమనాన్నిచ్చాడు. అయితే మరో ఓపెనర్ క్రాలీ నిలకడగా ఆడుతూ అర్ధశతకం పూర్తి చేసుకోవడం.. పోప్ (22) సైతం క్రీజులో కుదురుకోవడంతో ఇంగ్లాండ్ 129/1తో పటిష్ఠ స్థితికి చేరుకుంది. అయితే క్రాలీని ప్రసిద్ధ్ ఔట్ చేయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. వోక్స్ బ్యాటింగ్‌కు రాకపోవడంతో 9 వికెట్లకే ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు తెరపడింది.



## బాత్రూమ్‌లో విరాట్ ఏడవడం చూశా

**యుజ్వేంద్ర చాహల్**

జట్టు విజయం కోసం చివరి వరకూ పోరాడటం అతడి నైజం. కానీ, కీలక సమయంలో తన టీమ్ ఓడిపోతే తట్టుకోలేడు. అతడి నాయకత్వంలో ఒక్క ఐసీసీ ట్రోఫీని భారత్‌కు అందించలేకపోయినా సరే అద్భుత సారథుల్లో ముందువరుసలో ఉంటాడు. అతడే విరాట్ కోహ్లీ. 2019 వన్డే ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియాకు నాయకత్వం వహించిన సంగతి తెలిసిందే. సెమీస్‌లో న్యూజిలాండ్ చేతిలో భారత్ ఓడిపోయింది. ఎంఎస్ ధోనీ, రవీంద్ర జడేజా పోరాడినా టీమ్‌ఇండియాకు ఓటమి తప్పలేదు. ఆ పరాభవాన్ని తట్టుకోలేక భారత అభిమాని మాత్రమే కాకుండా జట్టులోని ప్రతి ఒక్కరూ బాధపడ్డారు. విరాట్ అయితే బాత్రూమ్‌లోకి వెళ్లి మరీ ఏడ్చినట్లు సీనియర్ క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో బయటపెట్టాడు. గత ఐపీఎల్ టైటిల్‌ను బెంగళూరు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అప్పుడూ కోహ్లీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. దానిని గుర్తు చేసుకుంటూ.. "2019 వరల్డ్ కప్ సమయంలోనూ కోహ్లీ ఏడవడం చూశా. అతడు మాత్రమే కాదు జట్టులోని ప్రతి ఒక్కరిదీ అదే పరిస్థితి. నేనే చివరిగా క్రీజ్‌లో నుంచి వచ్చా. కోహ్లీను దాటి ముందుకెళుతుంటే అప్పటికే అతడి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ధోనీకిదే చివరి మ్యాచ్. మరో 15 పరుగులు తక్కువగా ఇవ్వాల్సింది. నేను ఇంకొంచెం ఉత్తమంగా బౌలింగ్ చేసి ఉంటే బాగుండేదనిపించింది" అని చాహల్ వెల్లడించాడు. ఆ మ్యాచ్‌లో అతడు 10 ఓవర్లలో 63 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ మాత్రమే తీశాడు.




## జులై జీఎస్టీ వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లు

వస్తు, సేవల పన్ను వసూళ్లు మరోసారి భారీగా నమోదయ్యాయి. జులై నెలలో రూ.1.96 లక్షల కోట్లు వసూలయ్యాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి 7.5 శాతం వృద్ధి నమోదైంది. ఈ మేరకు జులై నెలకు సంబంధించిన జీఎస్టీ గణాంకాలను కేంద్రం శుక్రవారం విడుదల చేసింది. గతేడాది జులైలో జీఎస్టీ రూపంలో రూ.1.82 లక్షల కోట్లు వసూలైంది. జీఎస్టీ వసూళ్లు గత కొన్ని నెలలుగా రూ.1.8 లక్షల కోట్లు పైన స్థిరంగా నమోదవుతూ వస్తున్నాయి. ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం ఇది వరుసగా ఏడోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఏప్రిల్‌లో అత్యధికంగా రూ.2.37 లక్షల కోట్లు వసూళ్లు సాధించగా.. జూన్‌లో రూ.1.85 లక్షల కోట్లు వసూళ్లు నమోదయ్యాయి.



## మార్కెట్లోకి హెూండా సీబీ125 హార్నెట్, షైన్ 100డీఎక్స్.. ధరెంతంటే?

హెూండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇటీవల ఆవిష్కరించిన షైన్ 100 డీఎక్స్, సీబీ125 హార్నెట్ బైక్‌ల ధరలు వెల్లడయ్యాయి. షైన్ 100 డీఎక్స్ ధరను రూ.74,959 (ఎక్స్‌షోరూమ్)గా కంపెనీ నిర్ణయించింది. ఇక సీబీ125 హార్నెట్ ధర రూ.1.12 లక్షలుగా పేర్కొంది. నేటి నుంచి (ఆగస్టు 1) బుకింగ్‌లు మొదలయ్యాయి. షైన్ డిజైన్‌ను కొనసాగిస్తూ షైన్ 100 డీఎక్స్‌ను హెూండా కొత్తగా తీసుకొచ్చింది. దీంట్లో 98.98 సీసీ ఫ్యుయెల్ ఇంజెక్టెడ్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 7500 ఆర్‌పీఎం వద్ద 7 బీహెచ్‌పీ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అలాగే 5000 ఆర్‌పీఎం వద్ద 8.04 ఎన్ఎం టార్క్‌ను అందిస్తుంది. ఇందులో మల్టీప్లేట్ వెట్ క్లచ్ ఇచ్చారు. సెల్ఫ్ స్టార్ట్, కిక్ స్టార్ట్ ఆప్షన్లతో వస్తోంది. ఈ బైక్ పెర్ల్ ఇగ్నియస్ బ్లాక్, ఇంపీరియల్ రెడ్ మెటాలిక్, అథ్లెటిక్ బ్లూ మెటాలిక్, జెనీ గ్రే మెటాలిక్ కలర్స్‌లో లభిస్తుంది. సీబీ125 హార్నెట్‌లో స్పోర్టీ డిజైన్ ఇచ్చారు. యువతను ఆకర్షించే విధంగా దీన్ని ఎల్ఈడీ లైటింగ్‌తో తీసుకొచ్చారు. ఇందులో ట్విన్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, అధిక సామర్థ్యం గల 123.94సీసీ ఫ్యుయెల్- ఇంజెక్టెడ్ ఇంజిన్‌ను అమర్చారు. 5 స్పీడ్ గేర్‌బాక్స్ ఇచ్చారు. ఇది 7500 ఆర్‌పీఎం వద్ద 10.99 బీహెచ్‌పీ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అలాగే 6000 ఆర్‌పీఎం వద్ద 11.2 ఎన్ఎం శక్తిని అందిస్తుంది. 4.2 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే, బ్లూటూత్ కనెక్టివిటీ, హెూండా రోడ్‌సింక్ యాప్ ఇంటిగ్రేషన్, ఏబీఎస్, ఇంజిన్ స్టాప్ స్విచ్‌ను ఇచ్చారు. ఇది 5.4 సెకన్లలోనే 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. హీరో ఎక్స్‌ట్రీమ్ 125 ఆర్, టీవీఎస్ రైడర్ వంటి మోడళ్లతో ఈ బైక్ పోటీపడనుంది. లెమన్ ఐస్ ఎల్లో విత్ పర్ల్ సెరెన్ బ్లూ, పర్ల్ ఇగ్నియస్ బ్లాక్, అథ్లెటిక్ బ్లూ మెటాలిక్ విత్ పర్ల్ సెరెన్ బ్లూ, స్పోర్ట్స్ రెడ్ విత్ పర్ల్ సెరెన్ బ్లూ వంటి కాంబినేషన్స్‌లో లభిస్తుంది.

# రూ.6 లక్షల కోట్లు ఆవిరి

## భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాంతాన్ని నష్టాలతో ముగించాయి. భారత్‌పై 25 శాతం సుంకం విధించడంతోపాటు ఇతర వాణిజ్య భాగస్వాములపైనా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌లు విధించడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. మరోవైపు విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతుండడం, బలహీన త్రైమాసికాలు వంటివి సూచీలపై ప్రభావం చూపాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలూ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ ఒక్కరోజులోనే దాదాపు రూ.6 లక్షల కోట్లు ఆవిరై రూ.444 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 81,074.41 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,185.58) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే లాభాల్లోకి వెళ్లినప్పటికీ ఎంతోసేపు నిలవలేదు. ఆపై సూచీ రోజంతా నష్టాల్లోనే కదలాడింది. చివరికి 585.67 పాయింట్ల నష్టంతో 80,599.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 203 పాయింట్ల నష్టంతో 24,565.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.53గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, టాటా స్టీల్, మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ట్రెంట్, ఏషియన్ పెయింట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.49 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3346 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




## టారిఫ్‌లతో.. అమెరికా కుటుంబాలపై ఏటా రూ.2 లక్షల భారం



భారత్ సహా ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ సుంకాలు, జరిమానాలు విధిస్తున్న విషయం తెలిసిందే. అమెరికా ప్రజలపైనే ఇవి గణనీయంగా ప్రభావం చూపుతాయని తాజా నివేదిక వెల్లడించింది. కొత్త సుంకాలతో ద్రవ్యోల్బణం పెరగడం వల్ల కుటుంబాల వార్షిక సగటు ఖర్చు 2400 డాలర్లు (రూ.2లక్షలు) మేర పెరగనున్నట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ తాజా నివేదిక అంచనా వేసింది. సుంకాల ప్రభావంతో ఆర్థిక భారం అనేది ఆయా ఆదాయ వర్గాలపై భిన్నంగా ఉంటుందని ఎస్‌బీఐ నివేదిక వెల్లడించింది. అల్ప ఆదాయ కుటుంబాలపై 1300 డాలర్ల భారం పడనుండగా.. అధిక ఆదాయ కుటుంబాలు 5 వేల డాలర్లు అదనంగా ఖర్చు చేయాల్సిరావొచ్చని అంచనా వేసింది. స్వల్పకాలంలో సగటున 2400 డాలర్లు పెరిగే అవకాశం ఉన్నప్పటికీ దీర్ఘకాలంలో ఈ ప్రభావం తక్కువగానే ఉండవచ్చని తెలిపింది. ఈ వాణిజ్య వివాదంతో భారత్ కన్నా అమెరికా ఆర్థిక వ్యవస్థకే ఎక్కువ నష్టం కలిగే అవకాశం ఉందని ఎస్‌బీఐ నివేదిక అంచనా వేసింది. సుంకాల కారణంగా ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, తదితర రంగాల్లో దిగుమతి వస్తువుల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉండటంతో.. ఇప్పటికే పెరుగుతోన్న ద్రవ్యోల్బణంపై ఇవి మరింత ప్రభావం చూపనున్నట్లు పేర్కొంది. ఖర్చులు పెరగడం, డిమాండు తగ్గడం ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుందని, తద్వారా అమెరికా జీడీపీ వృద్ధి 40 నుంచి 50 బేసిస్ పాయింట్లు తగ్గే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. సుంకాల పెరుగుదలతో ఇరు దేశాలు సవాళ్లను ఎదుర్కొంటాయని ఎస్‌బీఐ రీసెర్చ్ తన నివేదికలో పేర్కొంది. అయినప్పటికీ డాలర్ క్షీణించడం, ద్రవ్యోల్బణం పెరగడం, కనిష్ఠ జీడీపీ వృద్ధి అంచనాలతో భారత్ కంటే అమెరికాను ఇవి మరింత బలహీన స్థితిలోకి నెట్టేస్తాయని, భారత్ మాత్రం అంతర్జాతీయ ఒడుదొడుకులను ఎదుర్కొనే సన్నద్ధతతోనే ఉందని అభిప్రాయపడింది. భారత్ నుంచి అమెరికా దిగుమతి చేసుకునే అన్ని వస్తువులపై విధించిన 25 శాతం సుంకాలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. అయితే, ఈ సుంకాల ప్రభావాన్ని అంచనా వేస్తున్నామని, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని భారత ప్రభుత్వం చెబుతోంది. అమెరికాతో చర్చలు కొనసాగుతున్నాయని, ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేస్తామని ధీమా వ్యక్తం చేసింది.

## టీ20ల్లో టెయిలెండర్ 300 కొడతాడా?

**'పాక్ చమురు'పై ట్రంప్ వ్యాఖ్యలకు గొయెంకా కౌంటర్**



ఓవైపు భారత్‌తో సుంకాల విషయంలో కఠినంగా ఉంటోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. పాకిస్థాన్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకోవడం చర్చనీయాంశమైంది. అంతే కాదు.. భారత్‌కూ పాక్ చమురును విక్రయించే పరిస్థితి వస్తుందంటూ విచిత్ర వ్యాఖ్యలు చేశారు. దీని పై ప్రముఖ వ్యాపారవేత్త హర్ష్ గొయెంకా స్పందిస్తూ అగ్రరాజ్య అధ్యక్షుడి తీరు ను తప్పుబట్టారు. ఆయన వ్యాఖ్యలు.. 'లగాన్'లో మాత్రమే సాధ్యమవుతాయని అన్నారు. ట్రంప్ పోస్ట్‌ను 'ఎక్స్'లో షేర్ చేసిన హర్ష్ గొయెంకా.. "భారత్‌కు పాకిస్థాన్ చమురును విక్రయిస్తుందని చెప్పడం అంటే.. టీ20 మ్యాచ్‌లో టెయిలెండర్ ట్రిపుల్ సెంచరీ బాదేస్తాడని అనడం లాంటిదే. సాంకేతిక అంశాలను పక్కనబెడితే వాస్తవ రూపంలో అది అసాధ్యం. ఇలాంటివి నిజ జీవితంలో కంటే 'లగాన్'లో జరిగే అవకాశాలే ఎక్కువ" అని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. పాకిస్థాన్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు ట్రంప్ నిన్న ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిద్వారా దక్షిణాసియాలో అతిపెద్ద చమురు నిల్వ దేశంతో కలిసి పనిచేయనున్నామని వెల్లడించారు. ఏదోఒకరోజు భారత్‌కూ పాకిస్థాన్ చమురు విక్రయించే రోజు రావొచ్చని సామాజిక మాధ్యమ పోస్టులో వ్యాఖ్యానించారు. అయితే పాకిస్థాన్‌లో చమురు నిల్వలపై ఏ సమాచారం ఆయనవద్ద ఉందో తెలియడం లేదు. ప్రస్తుతం పశ్చిమాసియా నుంచి చమురును పాక్ దిగుమతి చేసుకుంటోంది.

అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# ఉత్తమ తెలుగు చిత్రం 'భగవంత్ కేసరి'

## జాతీయ చలన చిత్ర అవార్డులు

71వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం ప్రకటించింది. జాతీయ ఉత్తమ చిత్రంగా '12 ఫెయిల్'కు అవార్డు దక్కింది. జాతీయ ఉత్తమ నటుడి అవార్డును ఇద్దరు పంచుకున్నారు. షారుక్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మస్సే (12 ఫెయిల్)లు ఎంపికయ్యారు. ఉత్తమ నటిగా 'మిస్సెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' (హిందీ)లో నటనకు రాణీ ముఖర్జీని అవార్డు వరించింది. ఇక ఉత్తమ తెలుగు చిత్రంగా బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరిని అవార్డు వరించింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీలో శ్రీలీల, కాజల్ కీలక పాత్రలు పోషించారు. అలాగే, ఉత్తమ యాక్షన్ (స్టంట్ కొరియోగ్రఫీ)లో 'హను-మాన్' చిత్రం అవార్డు దక్కించుకోగా, ఉత్తమ గేయ రచయితగా 'బలగం'లో 'ఊరు పల్లెటూరు' పాటకు గానూ కాసర్ల శ్యామ్ అవార్డును సొంతం చేసుకున్నారు. ఇక ఉత్తమ తమిళ చిత్రంగా 'పార్కింగ్'కు అవార్డు దక్కింది. బెస్ట్ ఫిల్మ్ క్రిటిక్ అవార్డు ఉత్పల్ దత్త (అస్సామీ)కు ప్రకటించారు. తొలుత నాన్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరి అవార్డులను వెల్లడించారు.




### జాతీయ చలన చిత్ర అవార్డులు ఫీచర్ ఫిల్మ్

- ఉత్తమ మ్యూజిక్ దర్శకత్వం : వాతి (తమిళ్) జీవీ ప్రకాశ్ కుమార్
- ఉత్తమ సంగీతం (నేపథ్యం): యానిమల్: హర్షవర్ధన్ రామేశ్వర్
- బెస్ట్ మేకప్: సామ్ బహాదర్ (హిందీ) శ్రీకాంత్‌దేశాయ్
- బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్: సామ్ బహదూర్ (హిందీ)
- బెస్ట్‌ప్రొడక్షన్ డిజైన్: 2018 – ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో (మలయాళం) మోహన్‌దాస్
- బెస్ట్ ఎడిటింగ్: పూక్కాలమ్ (మలయాళం) మిధున్ మురళి
- బెస్ట్ సౌండ్ డిజైన్: యానిమల్ (హిందీ) సచిన్ సుధాకరన్, హరి హరన్ మురళీ ధరన్
- బెస్ట్ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): బేబీ (తెలుగు) సాయి రాజేశ్ నీలం
- బెస్ట్ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): పార్కింగ్ (తమిళ్) రామ్‌కుమార్ బాలకృష్ణన్
- ఉత్తమ సంభాషణలు: సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై (హిందీ) దీపక్ కింగ్రానీ
- ఉత్తమ సినిమాటోగ్రఫీ: ది కేరళ స్టోరీ (హిందీ): పసంతను మొహపాత్రో
- ఉత్తమ నేపథ్య గాయని: జవాన్ (చెలియా) శిల్పారావు
- ఉత్తమ నేపథ్య గాయకుడు: బేబీ( పీవీన్ ఎస్ రోహిత్)
- బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్: గాంధీతాత చెట్టు (సుకృతివేణి), జిప్సీ (మరాఠీ) కబీర్ ఖందారీ, నాల్ 2 (మరాఠీ) త్రిష థోసర్, శ్రీనివాస్ పోకలే, భార్గవ్ జగ్దీప్
- ఉత్తమ సహాయ నటి: ఉల్లుకు (మలయాళం) ఊర్వశి, వష్ (గుజరాతీ) జానకీ బోడివాలా
- ఉత్తమ సహాయ నటుడు: పూక్కాలం (మలయాళం) విజయ రాఘవన్,, పార్కింగ్ (తమిళ్) ముత్తుపెట్టాయ్ సోము భాస్కర్
- ఉత్తమ నటి: మిస్సెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే (హిందీ):రాణీ ముఖర్జీ
- ఉత్తమ నటుడు: జవాన్ (హిందీ) షారుక్‌ఖాన్, 12 ఫెయిల్ (హిందీ) విక్రాంత్ మస్సే
- ఉత్తమ దర్శకత్వం: ది కేరళ స్టోరీ (హిందీ) సుదీప్తో సేన్
- ఉత్తమ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ మూవీ: హనుమాన్ (తెలుగు)
- ఉత్తమ బాలల చిత్రం: నాల్ (మరాఠీ)
- ఉత్తమ జాతీయ సమగ్రత, సామాజిక విలువల చిత్రం: సామ్ బహదూర్ (హిందీ)
- ఉత్తమ ప్రజాదరణ చిత్రం: రాకీ ఔర్ రాణి కి ప్రేమ్ కహానీ (హిందీ)
- ఉత్తమ పరిచయ దర్శకుడు: ఆత్మపాంప్లెట్ (మరాఠీ) ఆశిష్ బెండే
- ఉత్తమ ఫీచర్ ఫిల్మ్: 12 ఫెయిల్

### నాన్ ఫీచర్ ఫిల్మ్స్ కేటగిరి

- స్పెషల్ మెన్షన్ చిత్రాలు నేకల్: క్రానికల్ ఆఫ్ ప్యాడీ మ్యాన్ (మలయాళం)
- ది సీ అండ్ సెవెన్ విలేజెస్ (ఒడియా)
- బెస్ట్ స్క్రిప్ట్: సన్ ఫ్లవర్స్ వోర్ ది ఫస్ట్ వన్స్ టు నో (కన్నడ)
- బెస్ట్ వాయిస్ ఓవర్: ది సేక్రెడ్ జాక్ – ఎక్స్‌ప్లోరింగ్ ది ట్రీస్ ఆఫ్ విషెస్ (ఇంగ్లీష్)
- బెస్ట్ మ్యూజిక్ డైరెక్షన్: ది ఫస్ట్ ఫిల్మ్ (హిందీ)
- బెస్ట్ ఎడిటింగ్: మూవీంగ్ ఫోకస్ (ఇంగ్లీష్)
- బెస్ట్ సౌండ్ డిజైన్: దుందగిరి కే ఫూల్ (హిందీ)
- బెస్ట్ సినిమాటోగ్రఫీ: లిటిల్ వింగ్స్ (తమిళ్)
- బెస్ట్ డైరెక్షన్: ది ఫస్ట్ ఫిల్మ్ (హిందీ)
- బెస్ట్ ఎడిటింగ్: మూవీంగ్ ఫోకస్ (ఇంగ్లీష్)
- బెస్ట్ సౌండ్ డిజైన్: దుందగిరి కే ఫూల్ (హిందీ)
- బెస్ట్ సినిమాటోగ్రఫీ: లిటిల్ వింగ్స్ (తమిళ్)
- బెస్ట్ డైరెక్షన్ : ది ఫస్ట్ ఫిల్మ్ (హిందీ)
- బెస్ట్ ఆర్ట్స్/కల్చర్ ఫిల్మ్: టైమ్‌లెస్ తమిళనాడు (ఇంగ్లీష్)
- బెస్ట్ బయోగ్రాఫికల్ ఫిల్మ్: మా బావు, మా గావ్ (ఒడిశా), లెంటినో ఓవో ఏ లైట్ ఆన్ ది ఈస్ట్రన్ హోరిజాన్ (ఇంగ్లీష్
- ఉత్తమ పరిచయ దర్శకుడు: మావ్: ది స్పిరిట్ డ్రీమ్స్ ఆఫ్ చెరా (మిజో
- బెస్ట్ నాన్ ఫీచర్ ఫిల్మ్: ఫ్లవరింగ్ మ్యాన్ (హిందీ)




# చకచకా పెద్ది మూవీ షూటింగ్

కీలకమైన సన్నివేశాల చిత్రీకరణతో 'పెద్ది' సినిమా చకచకా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. అందులో భాగంగా రామ్‌చరణ్‌తోపాటు, ఇతర తారాగణం పై ఓ వేడుక నేపథ్యంలో సాగే సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా సెట్‌ని తీర్చిదిద్దారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ చిత్రమిది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. రామ్‌చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈ చిత్రం కోసం శారీరకంగా ప్రత్యేకంగా సన్నద్ధమయ్యారు రామ్‌చరణ్. వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో కన్నడ నటు-డు శివరాజ్ కుమార్‌తో పాటు, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్నారు.

## ఆసక్తికరంగా వచ్చిన వాడు గౌతమ్ టీజర్





యంగ్ హీరో అశ్విన్ బాబు చేస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'వచ్చినవాడు గౌతమ్' టీజర్ సినిమా మీద ఆసక్తి ఏర్పరిచింది. ఈ సినిమాకి మామిడాల ఎం.ఆర్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అరుణశ్రీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రొడక్షన్ నెంబర్ 3గా రూపొందుతున్న ఈ సినిమాని నిర్మాత టి.గణపతి రెడ్డి గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ప్రవల్లిక యోగి కో – ప్రొడ్యూసర్. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలు పెంచింది. ఆగస్ట్ 1 హీరో అశ్విన్ బాబు బర్త్ డే సందర్భంగా ఆయనకి విషెష్ అందిస్తూ మేకర్స్ ఒక పవర్ ఫుల్ పోస్టర్ రిలీజ్ చేశారు. అశ్విన్ బాబు ఇం-టె-న్స్ లుక్ లో కనిపించిన ఈ పోస్టర్ అదిరిపోయింది. ఇటివలే భారీ బడ్జెట్ తో హైవోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ షూట్ పూర్తి చేశారు.



# రామాయణ మ్యూజిక్‌లో కొత్త ఒరవడి

## రుద్రవీణను ఉపయోగిస్తున్న ఎఆర్ రహమాన్

బాలీవుడ్ నుంచి వస్తున్న ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టలలో 'రామాయణ'దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో సాయిపల్లవి, బాలీవుడ్ నటు-డు రణ్‌బీర్ కపూర్, కన్నడ స్టార్ నటుడు యష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాకు దంగల్ సినిమా దర్శకుడు నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా.. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నాడు. రణ్‌బీర్ కపూర్ రాముడి పాత్రలో నటిస్తుండగా.. సాయి పల్లవి సీత పాత్రను పోషిస్తుంది. కన్నడ స్టార్ నటు-డు యష్ రావణుడి పాత్రలో నటించబోతున్నాడు. ఇక హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్, -కై-కేయి పాత్రలో లారా దత్తా నటిస్తుండగా.. లక్ష్మణుడి పాత్రలో రవి దూబే నటించబోతున్నాడు. రెండు పార్టులుగా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ సినిమాకు ఆస్కార్ దిగ్గజాలు, ప్రముఖ సంగీత దర్శకులు ఆ.. రెహమాన్, హన్స్ జిమ్మర్ కలిసి సంగీతం అందిస్తున్నారు. ఇదిలావుంటే తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది.రామాయణం సినిమాలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కోసం భారతీయ వాయిద్యాలలో పురాతనమైన రుద్ర వీణను రెహమాన్ ఉపయోగించబోతున్నట్లు- సమాచారం. దీనికి సంబంధించి ఇప్పటికే మ్యూజిక్ పనులు కూడా మొదలు పెట్టినట్లు- తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన వెలుబడలేదు.



# కింగ్డమ్ పార్ట్ -2పై అప్పుడే ప్రకటన

విజయ్ దేవరకొండ అభిమానులు కోరుకున్నట్టుగానే 'కింగ్డమ్' పార్ట్ 2 ఉంటుందని తేలిపోయింది. నాగవంశీయే ఈ విషయం చెప్పారు. కింగ్డమ్‌తో తో ఆయన విజయాన్ని అందుకోవడం ఆనందంగా ఉందని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు. విజయ్ ప్రస్తుతం చేస్తున్న సినిమాలు పూర్తవ్వగానే 'కింగ్డమ్ 2' మొదలవుతుందని, అందులో మరో అగ్ర హీరో కూడా ఉంటారని చెప్పారు. ఆయన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థతో కలిసి సితార ఎంటర్-టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మించిన చిత్రమే 'కింగ్డమ్'. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించారు. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. చిత్రానికి లభిస్తున్న స్పందనపై ఆనందం వ్యక్తం చేసారు. మేం ఊహించినట్టుగానే సినిమాకి మంచి స్పందన లభిస్తోంది. సాంకేతికంగా గొప్పగా ఉందనే ప్రశంసలు లభిస్తున్నాయి. ఒక తెలుగు సినిమాని హాలీవుడ్ స్థాయి సాంకేతికతతో తీశాం. థియేటర్‌కి వచ్చిన ప్రేక్షకులంతా తప్పకుండా సినిమాని ఆస్వాదిస్తారు. త్వరలోనే ఆంధ్రలో విజయోత్సవాన్ని నిర్వహిస్తాం' అన్నారు. 'కింగ్డమ్ 2'లో హీరోయిన్ పాత్రకి ప్రాధాన్యం ఉంటుందని, ఈ సినిమాలో పాట పెట్టేందుకు అవకాశం లభించలేదని ఆయన చెప్పారు. సినిమాలో కీలక పాత్ర పోషించిన నటుడు సత్యదేవ్ మాట్లాడుతూ విజయ్ గెలిస్తే నేను గెలిచినట్టే. ఏదైనా సాధించాలనే తపనతో సొంతంగా వచ్చే ఎంతోమందికి విజయ్ స్ఫూర్తి. ఇందులోని అన్నదమ్ముల బంధం గురించి, నటుల అభినయం గురించి అంతా మాట్లాడుతున్నారు. ఈ సినిమా ఇచ్చిన ఉత్సాహంతో మరిన్ని మంచి సినిమాల్ని అందించడానికి ప్రయత్నిస్తాం అన్నారు.

# మహావతార్ నరసింహకు జనం నీరాజనం




పౌరాణిక పాత్రలకు తిరుగులేదని మరోసారి నిరూపించింది 'మహావతార్ నరసింహ' అనే సినిమా. నిజానికి, ఈ సినిమాని హోంబాలే ప్రొడక్షన్స్ వాళ్ళు రిలీజ్ చేయడానికి ముందుకు వచ్చేవరకు అసలు ఈ సినిమా ఒకటి ఉందని కూడా ఆడియన్స్‌కి తెలియదు. హోంబాలే ఫ్యాన్ ఇండియా లెవెల్‌లో సినిమాని రిలీజ్ చేయడానికి రెడీ అవ్వడం, తెలుగులో గీత ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ చేయడంతో సినిమా మీద చర్చ జరిగింది. తర్వాత వచ్చిన ట్రైలర్ కూడా పెద్దగా ఆడియన్స్‌ని థియేటర్లకు రప్పించలేకపోయింది. కానీ, సినిమా చూసిన వారంతా సినిమా అద్భుతం అంటూ అబ్బురపడుతూ సోషల్ మీడియాలో మౌత్ టాక్ స్ప్రెడ్ చేయడంతో సినిమాకి ఇప్పుడు కలెక్షన్ల వర్షం కురుస్తోంది. తాజాగా, ఈ సినిమా ఇప్పటివరకు 53 కోట్ల రూపాయల కలెక్షన్లు రాబట్టినట్లుగా అధికారికంగా ప్రకటించింది సినిమా యూనిట్. ఇప్పటివరకు ఈ సినిమా 53 కోట్ల బాక్స్ ఆఫీస్ గ్రాస్ సాధించినట్లు- వెల్లడించారు. ఈ సినిమాని క్లీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద శిల్పా ధావన్ నిర్మించగా, అశ్విన్ దర్శకుడిగా వ్యవహరించారు. ఈ సినిమాని హిందీలో అనిల్ తడానికి సంబంధించిన ఏ ఏ ఫిలిమ్స్ డిస్ట్రిబ్యూట్ చేయగా, ఒక్కొక్క భాషలో ఆయా భాషల్లో సిద్ధహస్తులైన డిస్ట్రిబ్యూటర్ల చేత రిలీజ్ చేయించారు. దీంతో సినిమా మీద అందరి దృష్టి పడడమే కాదు, సినిమా మంచి టాక్‌తో దూసుకుపోయింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, తెలుగు రాష్ట్రాల విషయానికి వచ్చేసరికి విజయ్ దేవరకొండ కింగ్డమ్ సినిమా కంటే కొన్ని చోట్ల ఈ సినిమా బుకింగ్స్‌లో డామినేట్ చేయడం గమనార్హం. దాదాపు వారం గడుస్తోంది.

# అజయ్‌గా యోగి ఆదిత్యనాథ్ బయోపిక్

## చిత్రానికి సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ నిరాకరణ



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన 'అజయ్' అనే సినిమాకు సెన్సార్ బోర్డు నుంచి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఈ చిత్రానికి సర్టిఫికెట్ జారీ చేయడానికి సెన్సార్ బోర్డు నిరాకరించింది. యోగి ఆదిత్యనాథ్ జీవితం ఆధారంగా ఓ సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. 'అజయ్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఎ యోగి' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాకు రవీంద్ర గౌతమ్ దర్శకత్వం వహిస్తుండగా.. యోగి పాత్రలో బాలీవుడ్ నటు-డు అనంత్ జోషి యోగి కనిపించబోతున్నాడు. ఈ చిత్రంలో పరేష్ రావాల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ప్రముఖ రచయిత శాంతను గుప్తా రాసిన 'ది మాంక్ హూ బికేమ్ చీఫ్ మినిస్టర్' అనే పుస్తకం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమాకు సర్టిఫికెట్ జారీ చేయడానికి సెన్సార్ బోర్డు నిరాకరించింది. ఈ సినిమాకి సెన్సార్ ఇవ్వడం కుదరదని వెల్లడించింది. దీంతో ఈ చిత్ర దర్శక, నిర్మాతలు ముంబై హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం దీనిపై విచారణ జరుగబోతుంది. అయితే ఈ పిటిషన్‌పై కోర్టు స్పందిస్తూ.. సెన్సార్ బోర్డును కొన్ని ప్రశ్నలు అడిగింది. ఈ సినిమాకు ప్రేరణనిచ్చిన నవల ఎనిమిదేళ్ళుగా ప్రజలకు అందుబాటు-లో ఉన్నప్పుడు ఎటు-వంటి అభ్యంతరాలు రాలేదు. మరి అదే నవల ఆధారంగా తెరకెక్కిన సినిమాకు ఎందుకు అభ్యంతరాలు వస్తాయి.. సెన్సార్ ఎందుకు నిరకరించారో చెప్పాలంటూ సెన్సార్ బోర్టును హైకోర్టు ఆదేశించింది. సినిమాకు సెన్సార్ ఆలస్యం చేయడానికి గల కారణాలను వివరించాలని కోర్టు ఆదేశించింది. దీనిపై స్పందించిన బోర్డు రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని కోర్టుకు హామీ ఇచ్చింది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com